ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 5 | జనవరి 2021

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977



ఈ సంచికలో....

23-09-1987 చించినాడ

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 23 సెప్టెంబర్ 1987, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం డిమాండ్ చేస్తే అనుబంధం రాదు. ప్రేమ వల్ల, ఆప్యాయత వల్ల అనుబంధం కలుగుతుంది. మీరు ఇంత శ్రద్ధగా ఇక్కడకు వచ్చినందుకు, ఇంత భక్తిగా వచ్చినందుకు చాలా సంతోషం. నీ స్తోత్ర పాఠాలు చెప్పటం వల్ల మాకు ఔన్నత్యం కలిగింది లేకపోతే ఔన్నత్యం ఎక్కడ నుంచి వస్తుంది అని అరుణాచలేశ్వరున్ని ఉద్దేశించి రమణ స్వామి అక్షరమణమాలలో చెప్పాడు. భగవంతుడు కూడా చెప్పాడు నా శరీరం కంటే కూడా నేను భక్తులని ఎక్కువ ఆప్యాయంగా చూసుకుంటాను. శ్రద్ధ లేకపోతే భక్తి కలగదు. మనకి భక్తి కలగాలి అంటే ఊరికే కలగదు. అనేక జన్మల నుండి ఎంతో శ్రద్ధ కలిగి ఉంటే మనకు భక్తి కలుగుతుంది. వ్యాకరణం లేని భాష ఎలా ఉంటుందో శ్రద్ధ లేని భక్తి కూడా అలాగే ఉంటుంది. అందుచేత శ్రద్ధ చాలా ముఖ్యం. మనకి పూర్వజన్మలలో చేసిన కృషి వల్ల శ్రద్ధ కలుగుతుంది. మానసికంగా మనకి ఉండే కొన్ని అలవాట్లే వాసనలు. మనస్సులో ఉన్న అలవాట్లే వాసనలు. సర్వసాధారణంగా ఈ నేను ఎవడను అనే ప్రశ్న అందరికి కూడా కొంత అసహజంగా ఉన్నట్టు అనిపిస్తూ ఉంటుంది అలవాటు లేకపోతే అభ్యాసం లేకపోతే మీరు ఏ మార్గం అవలంబించండి భక్తిమార్గమో, జ్ఞానమార్గమో, ఏదో ఒక రొబ్బ పట్టుకుని వేలాడండి. అయితే పట్టుకున్న రొబ్బ మటుకు గట్టిగా ఉండాలి. రొబ్బ అల్పంగా ఉంటే మనం కింద పడిపోతాం. ఆధ్యాత్మిక చింతన లేని వాడు అయినా

సరే, ఆధ్యాత్మిక చింతనలోకి వచ్చినవాడు అయినా సరే, ఈ మార్గంలోకి వచ్చాక కూడా సర్వసాధారణంగా చాలామంది చేసేది ఏమిటంటే వాళ్ళని వాళ్ళు పొగుడుకోవడం. ఎదుటివాళ్ళను విమర్శించడం. ఇది మన వాళ్ళు ఎలా చెబుతారు అంటే ఆత్మస్తుతి, పరనింద. మనస్సు ఈ రెండు పనులు చేస్తూ ఉంటుంది. తనని తాను పొగుడుకోవడం. శరీరం పొగుడుకోగలదా తనని తాను, శరీరం తనని తాను పొగుడుకోదు. ఎదుటివాడిని విమర్శించినా శరీరం విమర్శించదు కదా. ఈ పనులు అన్నీ ఎవరు చేస్తున్నారు? మనస్సు చేస్తుంది. అంటే ఆధ్యాత్మిక సాధనలో ముఖ్యంగా సాధన చేసే వాళ్ళు అందరూ గుర్తుంచుకోవలసినది కూడా ఎవరి మనసును వాళ్ళు నిందించుకోవాలి. ఎదుటివాళ్ళను నిందించడం కాదు నా మనస్సుని నేను నిందించుకోవాలి. కోతి చేష్టలు అన్నీ చేసేది మనస్సే. నరకానికి తీసుకు వెళ్ళేది మనస్సే. మనల్ని దుఃఖంలో పెట్టేది మనస్సే, సంసారంలో అనేక బాధలు తీసుకు వచ్చేది మనస్సే. మనసులో గూడు కట్టుకున్న కోరికలే సంసారం. బయట ఉన్న వ్యక్తులు సంసారం కాదు. మన మనస్సే సంసారం. ఎవడి మనస్సు వాళ్ళకి సంసారం. అందుచేత సంసారాన్ని ఎవరు తీసుకు వస్తున్నారు, లోకాన్ని ఎవరు తీసుకు వస్తున్నారు, దేహాన్ని ఎవరు తీసుకు వస్తున్నారు అంటే దేవుడు కాదు నా మనస్సు తీసుకు వస్తుంది. దేవుడు సృష్టి వల్ల దుఃఖం రాదు. మనస్సు సృష్టి వల్ల దుఃఖం వస్తుంది. మీకు ఎవరికి అయినా దుఃఖం వస్తుంటే అది దేవుడి సృష్టి కాదు. ఇందులో ఎవరికి అయినా సరే ఏ కారణం వల్ల అయినా దుఃఖం వస్తుంటే అది దేవుడి సృష్టి కాదు. మరి ఎవరి సృష్టి? మనస్సు సృష్టి వల్ల దుఃఖం వస్తుంది. దేవుడికి పక్షపాతం ఉంటుంది అని మీరు ఎవరు అయినా అనుకుంటున్నారా? పక్షపాతం ఉంటే వాడు దేవుడు అవుతాడా? ఇక్కడ కొంతమంది దుఃఖంగా ఉన్నారు. కొంతమంది సుఖంగా ఉన్నారు. అనేకమంది అనేక రకాలుగా ఉన్నారు. ఇన్ని రకాలుగా మనుషులు కనిపిస్తూ ఉంటే ఇందులో ఒకడిని దేవుడు సుఖ పడమన్నాడా, ఇంకొకడిని దుఃఖ పడమన్నాడా, ఒకడిని కష్ట పడమన్నాడా, ఇదంతా దేవుడు చేస్తున్నాడా? దేవుడు కాదు. దేవుడు సమానంగా ఉన్నాడు. దేవుడు మన అందరిలోనూ సమానంగా లేకపోతే వాడు దేవుడే కాదు. అందరిలోనూ ఆయన సమానంగా ఉన్నాడు. అందులో సందేహ పడక్కర్లేదు. మనం శ్రవణం చేస్తున్నాం కానీ సందేహానికి గురి అవుతున్నాం. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి భగవంతుడు చెప్పిన మాటలు, జ్ఞాని చెప్పిన మాటలు, మీరు సదా మనస్సులో తిప్పుకుంటూ ఉంటే మనస్సు పడిపోతుంది. మనస్సు పోతే మీరు పోరు. మనస్సు పోతే ఆత్మకు నష్టం లేదు. మీరు ఆత్మ అందుచేత

మీరు ఏమీ నష్టపోరు. మనస్సు నాశనం అయితే ఈ అహంకారం పోతే మనం పోతామేమో, ఈ శరీరం పోతే మనం పోతామేమో అలా ఎవరు అనుకోవద్దు. మనస్సు నశిస్తే మీరు ఏమీ పోరు. ఈ శరీరం పతనం అయితే మీకు ఏమీ నష్టం లేదు. ఇదంతా కల్పితం. కల్పితం లోంచే దుఃఖం వస్తుంది. యదార్థం లోంచి దుఃఖం రాదు. అందుచేత మనం సదా జ్ఞాపకం ఉంచుకోవల్సింది, ఎల్లప్పుడూ నిరంతరం గుర్తుంచుకోవల్సింది జ్ఞాని చెప్పిన మాటలు, శాస్త్రం చెప్పిన మాటలు. అంటే భగవంతుడు చెప్పినటువంటి మాటలు. మనం వాటిని మననం చేసుకోవాలి అలా మననం చేసుకోగా చేసుకోగా, మీ మనస్సు నెమ్మదిగా మీకు తెలియకుండా హృదయగుహలోకి జారిపోతుంది. అంటే హృదయంలో నివసిస్తున్న పరమాత్మ వైపుకి జారిపోతుంది. అప్పుడు మీరు పోరు, మీరు ఎవరో మీకు తెలుస్తుంది. కానీ అహంకారం పోతే మనం పోతాం అని భయం వేస్తుంది అందరికి. మనం పోము మనం ఎవరమో మనకు తెలుస్తుంది. అప్పుడు సుఖం అంటే ఏమిటో మనకు తెలుస్తుంది. అందుచేత ఎవరి మనస్సుని వారే నిందించుకోవాలి. ఎవరి మనస్సుని వారే విచారణ చేసుకోవాలి. మనమందరం చేసేది లోకవిచారణ. కాని ఏమనుకుంటున్నాం. ఆత్మవిచారణ చేస్తున్నాం అని అనుకుంటున్నాం. ఆత్మవిచారణ చేయాలి అని అనుకొంటాము కానీ క్రియలోకి వచ్చేటప్పటికి ఏమి చేస్తున్నాం? లోకవిచారణ చేస్తున్నాం. అందుచేత మనం ఆత్మకి దూరంగా ఉన్నాం, లోకానికి దగ్గరగా ఉన్నాం. లోకానికి దగ్గరగా ఉన్నాం అంటే దుఃఖానికి దగ్గరగా ఉన్నాం. ఆత్మకి దగ్గరగా ఉంటే సుఖానికి దగ్గరగా ఉంటాం. అందుచేత మన గమ్యం ఆత్మే. మనం తెలుసుకోవలసింది ఆత్మే. మనంజీవించవలసింది ఆత్మలో. మన జీవితం యొక్క లక్ష్యం ఏమిటి? ఆత్మను గ్రహించడం. ఆత్మ అంటే ఏమిటి? యధార్థం. అది తప్పించి మిగతాది అంతా కూడా కల్పితమే. ఆత్మ సర్వస్వం. ఆత్మ లేని చోటు అంటూ ఏమి లేదు. అయితే ఆత్మను గ్రహించాలి అంటే మన మనసుని మనం శిక్షణలో పెట్టుకోవాలి. మన మనస్సుని మనం నిందించుకోవాలి. మనస్సు పరిమితం అయినది. ఆత్మ అపరిమితం అయినది. మనస్సు ఖండమైనది. ఆత్మ అఖండమైనది. మనస్సులో ఉన్నది అశాంతి. ఆత్మలో ఉన్నది శాంతి. ఆత్మ ఎక్కడ ఉంది? భగవంతుడు ఏమి చెబుతున్నాడు? అందరి హృదయాలలోను ఆత్మగా నేను ప్రకాశిస్తున్నాను. అది ఆయన చెప్పినటువంటి సత్యం. అది తెలుసుకునే వరకు అది మనకు అనుభవంలోకి వచ్చే వరకు మనకు దుఃఖం తప్పదు. ఏదొక రూపంలో దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. వైరాగ్యం, అభ్యాసం ఇవి రెండింటి వల్ల మనస్సు యొక్క చలనం ఆగుతుంది. మనస్సు దాని మూలంలోకి ప్రయాణం చేస్తుంది.

నేను ఎవడను అనే ప్రశ్న అభ్యాసానికి సంబంధించినది. ఒకటి మీరు జ్ఞాపకం ఉంచుకోండి. వైరాగ్యం లేకుండా ఎవరు సమాధిస్థితిని పొందలేరు. వైరాగ్యం అనేది లేకుండా ఎవడికి సమాధిస్థితి రానే రాదు. మిగతా ఉపాయాల వల్ల రానే రాదు. దుఃఖం కావాలి అని ఎవరైనా కోరుకుంటారా? ఎవరు కోరుకోరు. అందరికి సుఖం కావాలి. నాస్తికుడికి సుఖం కావాలి, ఆస్తికుడికి సుఖం కావాలి. అందరికి సుఖం కావాలి. కానీ మేము అందరం సుఖంగా ఉన్నామని ఎవరైనా చెప్పగలరా? మనకి ఏదైతే లేదో అది వస్తే సుఖం వస్తుంది అనిపిస్తుంది. మనకి ఇల్లు లేదు అనుకోండి ఇల్లు కట్టుకుంటే చాలు మనకి సుఖం వచ్చేస్తుంది అనిపిస్తుంది. ఇవన్నీ అవసరాలు. ఇల్లు ఉన్న వాళ్ళు అందరూ సుఖంగా ఉన్నారా? చాకిరి చేయలేక పోతున్నాం అంటున్నారు. సర్వసాధారణంగా మనకి నీడ అవసరం. Food అవసరం. కానీ food ఉన్నవాళ్ళు ఉన్నారు, నీడ ఉన్నవాళ్ళు ఉన్నారు. వాళ్ళు అందరూ సుఖంగా ఉన్నారా అంటే లేదు. గురువుకు అతని శిష్యుడు యొక్క, భక్తుడు యొక్క స్తోత్ర పఠనాలు అతనికి అక్కర్లేదు. ఈ స్తోత్ర పాఠాలు ఇవన్నీ కూడా మానసిక పరిధిలోనివి. కాని అతనికి కావలసినది ఏమిటి? వీడు జ్ఞాని కావడం. నిజమైన జ్ఞాని ఎదుటివాడిని జ్ఞాని చెయ్యాలని చూస్తాడు. ఎందుచేత అంటే జ్ఞానం యొక్క వైభవం జ్ఞానికి తెలుసు. అందుచేత ఎదుటివాడిని కూడా జ్ఞానిని చెయ్యాలి అని చూస్తాడు కానీ మధ్య దారిలో విడిచి పెట్టడు. పూర్వం మనం ఏమి సంబంధం లేకుండానే ఇక్కడ కలుసుకున్నామా? ఈ సంబంధం మనలని మరొక చోట కలపదా? అంటే ఆ గురు శిష్య సంబంధం జ్ఞానం కలిగేవరకు, ఆత్మస్వరూపం పొందేవరకు, అద్వైత శిఖరం అందే వరకు అది తెగదు. నిజమైన గురువు యొక్క లక్షణం ఏమిటి అంటే తన శిష్యుడిని జ్ఞానిని చేసే వరకు తాను విడిచి పెట్టడు. అందుకే భగవాన్ చెప్పారు. పులి నోట్లో చెయ్యి పెడితే ఆ చెయ్యి బయటకు లాక్కోవచ్చు కానీ జ్ఞాని దృష్టిలో పడ్డవాడిని తరింపచేసే తీరతాడు జ్ఞాని. అక్కడ నుండి తప్పకొనే అవకాశం లేదు. జ్ఞానం వైపు మనకు లక్ష్యం లేదు. ఎందుచేతనంటే దాని వైభవం మనకు తెలియటంలేదు.

అందరికీ సుఖం కావాలి. ఆ సుఖం ఎక్కడ ఉంది? లోకంలో ఉందా? లోకం అంతా దుఃఖం అని పరమాత్మ చెబుతున్నాడు. మరి సుఖం ఎక్కడ ఉంది? ఒక్క ఆత్మలో ఉంది. ఆత్మ ఎక్కడ ఉంది? మన హృదయంలో ఉంది. ఆత్మను విడిచి పెట్టి సుఖం లేదు. మీరు ఒక్కటే జ్ఞాపకం ఉంచుకోండి సుఖాన్ని కోరేవాడు ప్రతివాడు కూడా ఆత్మ దగ్గరకు వెళ్ళి తీరాలి. అందరికి సుఖం కావాలి. సుఖాన్ని వెతికేవాడు ప్రతివాడు వాడికి తెలియకుండా

వాడు దేవుడు కోసం అన్వేషణ చేస్తున్నాడు. అది వాడికి తెలియదు. అంటే ఏ వస్తువులు అయితే మన దగ్గర లేవో ఆ వస్తువు మనకి వస్తే సుఖం వస్తుంది అని మనం అనుకుంటాం. అది వచ్చిన తరువాత తెలుస్తుంది అందులో సుఖం లేదని. ఇదంతా కూడా మనసు యొక్క గారడీ. ఇదంతా మనసు యొక్క కల్పితం. అందరు సుఖాన్ని కోరుతున్నారు, అందరు శాంతిని కోరుతున్నారు. కానీ అది ఎక్కడ ఉందో మనం తెలుసుకోవాలి. అది నా స్వరూపంగా ఉంది. ప్రతీ మానవుడికి వాడి స్వరూపమే సుఖం. వాడి స్వరూపమే శాంతి, వాడు తన మనస్సుని నిర్మలం చేసుకుని తన హృదయంలోకి పంపిస్తే అంతర్ముఖం చేయగలిగితే అప్పుడు వాడికి శాంతి దొరుకుతుంది. ప్రతి వ్యక్తికి తనయందే పరమ ప్రీతి, మీరు మీ ఇంట్లో వ్యక్తులను ఎవరినైన ప్రేమిస్తున్నారు అనుకోండి, మీ ఇంట్లో వ్యక్తులను బాగా చూస్తున్నారు అనుకోండి వాళ్ళను కూడా మీ కోసమే బాగా చూస్తున్నారు. ఇదే మనం అర్థం చేసుకోవలసింది. మనం ఎవరితో అయినా స్నేహాలు చేసినా, బంధుత్వాలు చేసినా, సమాజంలో ఎవరి తోటి ఏది చేసినా అన్నిటికంటే utmostimportant ఏమిటంటే తనే. తనకోసమే మనిషి ఏ పని అయినా చేస్తున్నాడు అది జ్ఞాపకం ఉంచుకోండి. మనిషికి వాడంటేనే వాడికి ఎక్కువ ప్రీతి. కాని ఇప్పుడు మీరు ఆలోచించండి. మీ మీద మీకు ఎక్కువ ప్రీతి ఉందా? దేవుడు మీద ఎక్కువ ప్రీతి ఉందా మీకు? బయటివాళ్ళ మాట విడిచిపెట్టండి. మనందరంభక్తులమే. మన మీద మనకి ఎక్కువ ప్రీతి ఉందా? దేవుడు మీద ఎక్కువ ప్రీతి ఉందా మనకి? ఇదే భగవాన్ చెప్పారు. మనకి మనం ఉండాలి, లోకం ఉండాలి, దేవుడు ఉండాలి. మనం అడిగేవి అన్నీ దేవుడు ఇస్తూ ఉండాలి. అంటే మనకోసమే మనం దేవుడిని ప్రేమిస్తున్నాం. మన స్వార్థమే మనకు సెంటర్. మీరు ఆలోచించండి. మనం జపం చేస్తున్నాం, పూజ చేస్తున్నాం, ధ్యానాలు చేస్తున్నాం, వ్రతాలు చేస్తున్నాం, ఇవన్నీ మన కోసం చేస్తున్నామా? దేవుడి కోసం చేస్తున్నామా? అంటే మనం దేవుడు కోసం ఇవన్నీ చేయటంలేదు. దేవుడిని ప్రార్థిస్తేమనం సుఖపడతాం, ఇంకా మంచి జన్మలు వస్తాయి, ఇంకా ఉన్నత స్థితికి మనం వెళతాం, అనేటటువంటి వ్యక్తి భావన తోటి, స్వార్థం తోటి ఈ పనులు అన్నీ మనం చేస్తున్నాం. మీరు బాగా ఆలోచించండి. స్వార్థం తోటే మనం ఈ పనులు అన్నీ చేస్తున్నాం. కానీ భగవంతుడు ఏమి చెప్పాడు అంటే మీరు స్వార్థం లేకుండా పని చేయండి. మీరు స్వార్థం లేకుండా పని చేస్తే నా స్వరూపం మీకు తెలుస్తుంది. మీరు స్వార్థం తోటి పని చేస్తే మీకు పుణ్యం రావచ్చు. కాని నా స్వరూపం మీకు తెలియదు. మీరు స్వార్థం లేకుండా కనుక పని చేస్తే మీరు చేసే జపాల తోటి నిమిత్తం లేకుండా నా

స్వరూపం మీకు తెలుస్తుంది. కొంతమంది ధ్యానం చేస్తారు అది ఎంత బలవంతమో చాలా బాధ పడిపోతారు. బలవంతంగా కూర్చుంటారు. మీరు చేస్తున్న ధ్యానం కనుక నిజం అయితే ధ్యానానంతరం ఆనందం రావాలి, శాంతి రావాలి. ధ్యానానంతరం మీకు ఆనందం రావటం లేదు, శాంతి రావటం లేదు అనుకోండి అది ధ్యానం కాదు. ధ్యానమార్గం మంచిదే కానీ అయితే రమణస్వామిది ధ్యానపద్ధతి కాదు. ధ్యానం అంటే మనస్సును ఏకాగ్రం చేయటం. ఒక వస్తువును తీసుకోవటం, ఒక రూపాన్ని తీసుకోవటం, ఆ వస్తువు మీద మనస్సును ఏకాగ్రం చేయటం. మనకి ఏమిటి అంటే చిన్నతనం నుంచి రూపదృష్టి, నామదృష్టి, అలవాటు. మన మనస్సు ఆ మేతకి అలవాటు పడిపోయింది. ఎంతసేపు రూపము, నామము. రూపము, నామము. ప్రపంచం అంటేనే అంతా రూపము, నామము, క్రియ. ఇవి మూడు కలిపితేనే లోకం. మనకు చిన్నతనం నుంచి నామరూప దృష్టి మనస్సులో బాగా గాఢంగా, గూఢంగా నాటుకుపోయింది. మన మనస్సు రూపదృష్టికి అలవాటు పడిపోయింది కాబట్టి దేవుడికి ఒక రూపాన్ని కల్పించారు. కల్పించి ఆ రూపాన్ని ధ్యానం చేయమన్నారు. నిన్ను నువ్వు ఎక్కువగా ప్రేమించుకుంటున్నావు. కారణం ఏమిటి? సుఖం నీ స్వరూపం. ఇక్కడ ఇంతమంది మనం కూర్చున్నాం ఎవరికి అయినా మరణించాలి అని ఉందా? ఏవండీ ఎవరికి అయినా మరణం వస్తే భయం వేస్తుంది. వంద సంవత్సరాల వయస్సు వచ్చినా, మందులు లేకపోతే రోజులు వెళ్ళలేని పరిస్థితి వచ్చినా ఇంకా జీవించాలి అని ఉంటుంది. మరణించాలి అని ఎవరికీ ఉండదు. కారణం ఏమిటి? మన హృదయంలో ఉన్న వస్తువుకి మరణం లేదు. అందుచేత మనకి మరణించాలి అని ఉండదు. మనం ఎవరం? ఆత్మ. ఆత్మకి మరణం లేదు. అది మన హృదయంలోనే ఉంది. అందుకే మనం చావు రాకూడదు అనుకుంటున్నాం. ఎందుచేత నాలో ఉన్న వస్తువుకు చావు లేదు. మీరు ఎవరు అని అడిగితే మేము బ్రాహ్మణులం అండి, మీరు ఎవరు అంటే మేము రాజులం అండి. అంటే మీరు బ్రాహ్మణులం అని చెప్పేటప్పుడు, రాజులం అని చెప్పేటప్పుడు మీరు శరీరం దృష్టితో చెబుతున్నారా? ఆత్మ దృష్టితో చెబుతున్నారా? ఆలోచించండి. నేను మరణిస్తున్నాను అన్నప్పుడు నాది శరీర దృష్టా? ఆత్మ దృష్టా? దేహం జన్మిస్తే నేను జన్మించాను అనుకుంటున్నాను. దేహం లావుగా ఉంటే నేను లావుగా ఉన్నాను అనుకుంటున్నాను. దేహం సన్నంగా ఉంటే నేను సన్నంగా ఉన్నాను అనుకుంటున్నాను. దేహం ఎర్రగా ఉంటే నేను ఎర్రగా ఉన్నాను అనుకుంటున్నాను. దేహం నల్లగా ఉంటే నేను నల్లగా ఉన్నాను అనుకుంటున్నాను. దేహాన్ని నేను అనుకుంటున్నాం, అందుచేత దేహం ముసలిది అయితే

మనం ముసలి వాళ్ళం అయ్యాం అనుకుంటున్నాం. దేహం మరణిస్తే నేను మరణించాను అనుకుంటున్నాం. అందుచేత ఈ దేహానికే నేను పరిమితం అయి ఉంది. ఇది మన అనుభవంలో ఉన్న విషయం. మీరు ఎవరు అయినా కాదు అంటారా? మనం నేను నేను అంటున్నాం చూశారు ఈ నేను దేహానికి సంబంధించినదే. ఈ దేహాన్ని దృష్టిలో పెట్టుకునే మనం నేను అంటున్నాం. దేహానికి పరిమితం అయిపోయి ఉన్నాం కాబట్టి మనకి లోకం కనిపిస్తుంది. అంటే దేహదృష్టి తోటే మనం లోకాన్ని చూస్తున్నాం. నేను ఎవరో నాకు తెలియనప్పుడు ఆత్మదృష్టి కలగదు. పరాయి వ్యక్తిని చూసినప్పుడు కూడా దేహానికి పరిమితం అయ్యే చూస్తున్నాం. ఎందుచేత నేను దేనికి పరిమితం అయ్యి ఉన్నాను. ఈ నేను ఎవరు అనే ప్రశ్న ధ్యాన మార్గం కాదు. విచారణా మార్గం. విచారణ అంటే అన్వేషించటం. వెతుక్కోవటం. తన స్వరూపాన్ని వెతుక్కోవటం. ధ్యానం అంటే ఒక వస్తువు యందు తన మనసుని ఏకాగ్రం చేయటం. మనసుని ఎవరు వెతకటం ప్రారంభించరు. ఈ మనసు యొక్క మూలం వెతకటం ప్రారంభించు. మనస్సుని ఎప్పుడైతే వెతకటం నువ్వు ప్రారంభించావో అప్పుడు తెలుస్తుంది అది లేదు అని, నిరంతరం నువ్వు సుఖాన్ని పొందాలి అంటే శాంతిని పొందాలి అంటే నువ్వు తెలుసుకో నేను ఎవరు అనే ప్రశ్నకు సమాధానం. ఈ నేను ఎవరు అనే ప్రశ్నకు సమాధానం నీకు తెలిసే వరకు శాంతి దొరకదు. సుఖం దొరకదు. మీకు బాహ్యమైన comforts చేకూరినప్పటికీ మీకు తాత్కాలికంగా సుఖంగా ఉన్నట్టు, శాంతిగా ఉన్నట్టు అనిపిస్తుంది కానీ అది నిజం కాదు. మీకు నిజమైన ఆత్మ శాంతి కలిగితే అది చెదిరిపోవటానికి అవకాశం లేదు. ఒక్కొక్కసారి మనసు నిర్మలంగా ఉంటుంది. అంతమాత్రం చేత అది జ్ఞానం కాదు. జ్ఞానానికి గుర్తు ఒక్కటే వాడికి సత్యం తెలియబడాలి. సత్యాన్ని తెలుసుకునే వరకు మనిషికి అజ్ఞానం లోంచి విడుదల లేదు. అజ్ఞానం లోంచి విడుదల అయితేనే కాని జ్ఞానం కలగదు. జ్ఞానం కలిగితేనే కాని శాంతి కలగదు. మనసుని నిగ్రహించు కోవటానికి, మనసుని స్వాధీనం చేసుకోవటానికి, మనసుని నిర్మల పరచుకోవటం కోసం, మనసుకి ఏకాగ్రత తీసుకు రావటం కోసం, ఈ నేను ఎవరు అనే ప్రశ్న అంకుశం లాంటిది. అంటే ఏమిటి ఈ నేను ఎవరు అనే ప్రశ్న కూడా విచారణే. అది కూడా ఒక అభ్యాసమే. ఇది జ్ఞానపరమైనది. ఆత్మను తెలుసుకోవటానికి స్వామి శివానంద ఒకటి తరచుగా చెప్పేవారు. ఆయన ఎంతసేపు ఈ శరీరం నువ్వు కాదు, ఈ మనస్సు నువ్వు కాదు, నువ్వు ఆత్మవు అని చెప్పేవారు. అంటే ఈ శరీరం నువ్వు కాదు ఈ మనసు నువ్వు కాదు అని అనుకోవచ్చు. అనుకున్నంత మాత్రం చేత ఆత్మ తెలియబడదు. ఇవన్నీ

ఆత్మను తెలుసుకోవటానికి నీకు సహకారం అంతే. సర్వసాధారణంగా మనసు రెండు పనులు చేస్తుంది. అది మీ అందరికి అనుభవంలో ఉంటుంది. ఒకటి ఇంద్రియాలకు కావలసిన విషయాలు కోరుతూ ఉంటుంది, రెండు ఐశ్వర్యాలను కోరుతూ ఉంటుంది. జనరల్‌గా మనకి daytoday లైఫ్ లో మనం చూస్తే తెలుస్తుంది. జనరల్ గా మన మనస్సు చేసే పని ఇది. ఇవి రెండు మన మనసు కోరడం వల్ల అది బహిర్ముఖం అవుతుంది. మీరు ఉపాసన చేసినా, ధ్యానం చేసినా, జపం చేసినా ఎన్ని చేసినా మీ మనస్సు బహిర్ముఖం అవుతున్నంత కాలం మీకు జ్ఞానం కలగదు.

ఎంతో పుణ్యాత్ముడికి కానీ, ఎంతో సహృదయం కలవాడికి కానీ మనస్సు అంతర్ముఖం కాదు. వేలాది జన్మల నుంచి, లక్షలాది జన్మల నుంచి ఎవడి మనసు అయితే సంస్కరించుకున్నాడో, ఎవడి మనసు అయితే బాగు చేసుకున్నాడో, ఎవడి మనసు అయితే పుణ్య బలం వల్ల, యోగ బలం వల్ల సూక్ష్మాతి సూక్ష్మం అయ్యిందో ప్రాపంచిక సంస్కారాలు అన్నీ ఎవడి మనసు లోంచి అయితే రాలిపోయాయో, ఎవడి మనసు అయితే పరిశుద్ధం అయ్యిందో, స్ఫటికంలాగా స్వచ్ఛంగా ఉందో, వాడి మనసు మటుకే అంతర్ముఖం అవుతుంది కానీ మిగతా వారి మనసు ఐశ్వర్యం కోరుతూనే ఉంటుంది, విషయ సుఖాలు కోరుతూనే ఉంటుంది, కీర్తి కోరుతూనే ఉంటుంది. మీకు ఒక్కటే కొండ గుర్తు. ఎవరు పుణ్యాత్ముడు అంటే మనం ఏమనుకుంటాం అంటే ఎవరైనా దానం చేస్తే, ధర్మం చేస్తే వాడు పుణ్యాత్ముడు అనుకుంటాం. ఏమో వాడు కీర్తి కోసం దానం చేస్తున్నాడు ఏమో, భగవంతుడు చెప్పాడు అని చేస్తున్నాడా లేకపోతే కీర్తి కోసం చేస్తున్నాడా? అది కాదు. మీకు ఒక్కటే కొండ గుర్తు ఎవడు పుణ్యాత్ముడు అంటే ఎవడి మనసు అయితే అంతర్ముఖం అవుతుందో, తన ప్రయత్నం అక్కర్లేకుండా ఎవడి మనసు అయితే హృదయం అనే గూట్లో ఆ గుహలోకి వెళ్ళి పడుతుందో, వాడికి మోక్షం వస్తుంది. ఆ స్థితి మీలో ఎవరికి అయినా ఉందేమో చూసుకోండి. అంటే effort పనికిరాదు అని కాదు నేను చెప్పేది, effort అవసరమే కాని effort అక్కర్లేకుండా ఎవడి మనసు అయితే హృదయం అనే గూట్లో ఆ గుహలోకి వెళ్ళి పడుతుందో వాడికి మోక్షం వస్తుంది. శరీరం నేను కాదు, మనసు నేను కాదు, ఇంద్రియాలు నేను కాదు, విషయాలు నేను కాదు, లోకం నేను కాదు, ఈ స్థూల దేహం నేను కాదు, మరి అన్నీ నేను కాదు, నేను ఎవడను, అప్పుడు నేను ఎవడను అనే ప్రశ్న. ఇవి ఏమీ నేను కాదు అని నువ్వు చెబుతున్నావు. మరి నేను ఎవరు? వీటి అన్నిటిని తోసి వేసిన తర్వాత కూడా నువ్వు ఉంటావు. అందుకే

నేను ఎవరు అనే ప్రశ్న. సర్వసాధారణంగా ఏమి అనుకుంటున్నారు మనం చచ్చిపోతే ఉండము ఏమో అని మన అందరికి భయం వేస్తుంది. ఈ దేహం పోతే మనం పోతాం ఏమో అని అందరికి భయం కదా, మళ్లీ ఉండము ఏమో అని. దేహం పోయినప్పుడు తన అస్థిత్వం ఆగిపోతుంది ఏమో అని భయం, ఏవండీ మరి నిద్రట్లో కూడా తన అస్థిత్వం పోతుంది. నిద్రలో తన దేహానికి పరిమితం అయ్యి లేడు. తన మనస్సుకి పరిమితం అయ్యి లేడు, తన కుటుంబానికి పరిమితం అయ్యి లేడు, తన జాతికి పరిమితం అయ్యి లేడు, తన దేశానికి పరిమితం అయ్యి లేడు. నిద్రట్లో ఏ పరిమితులు వాడిని బంధించటం లేదు. కాని వాడు హాయిగా ఉన్నాడు. అప్పుడు ఎవడు వాడు? ఒక శాస్త్రానికి పరిమితం అయ్యి లేడు. నిద్రట్లో నీ దేవుడు గొడవలు కూడా లేవు. నువ్వు ప్రేమించే నీ బంధువులు లేరు, స్నేహితులు లేరు, నీ ఊరు లేదు, నీ జాతి లేదు, నీ కులం లేదు. ఏ పరిమితులు మిమ్మల్ని బంధించటం లేదు నిద్రట్లో మీకు దేవుడి స్మరణ లేదు మీకు నిద్రట్లో ఏ పరిమితులు లేకుండా, ఏ హద్దులు లేకుండా, సరిహద్దులు లేకుండా మీరు నిద్రట్లో ఉన్నారు. మీకు నిద్రట్లో చావు గొడవ కూడా లేదు. మరి ఏమీ లేకుండా, చావు లేకుండా, పుట్టుక లేకుండా, దేహ స్పర్శ కూడా లేకుండా, మానసిక స్పర్శ లేకుండా మీరు నిద్రట్లో ఉన్నారా లేదా? ఇప్పుడు మరణించిన తరువాత ప్రశ్న మాట ఎందుకు? మరణించిన తరువాత ఏమైపోతామో అని భయపడతారు ఎందుకు? మీరు అందరు గాఢనిద్రలో ఎక్కడ ఉన్నారు? గాఢనిద్రలో మీరు ఉన్నారా? లేదా? మేము నిద్రట్లో లేము అని ఇప్పుడు ఎవరైనా చెప్పగలరా? మీరు నిద్రట్లో లేకపోతే మాకు చాలా బాగా నిద్ర పట్టింది రాత్రి అని ఎవరు చెబుతున్నారు? మీరు నిద్రపోతున్న మాట నిజమే. కాని నిద్రపోకుండా మీలో ఒకడు ఉన్నాడు. వాడు మీ నిద్రని కూడా చూస్తున్నాడు. వాడు ఎవడు? వాడిని పట్టుకుని లాగు. నిద్రట్లో తెలియకుండానే నువ్వు ఆ స్వరూపంలో ఉన్నావు. అది నీకు తెలీదు, తెలుసుండి నువ్వు ఆ స్థితిని పట్టుకో, అంటే నువ్వు ఆ స్థితిని జాగ్రదావస్థలోతెచ్చుకో, నువ్వు జ్ఞానివి అవుతావు. మనసు చల్లబడాలి అండి, జ్ఞాన యోగానికి, జ్ఞాన విచారణకి చాలా ముఖ్యం ఏమిటి అంటే మనసు చల్లబడాలి. మనసు చల్లబడకుండా మనకి మోక్ష కాంక్ష కలుగనే కలగదు. అక్కడ మీకు కొండ గుర్తు ఒక్కటే. సత్యాన్ని దర్శించాలి, ఆత్మ స్వరూపాన్ని పొందాలి అనేటటువంటి కాంక్ష మీకు రావటం కూడా వివేకానికి గుర్తు. ఆ కాంక్ష మనకి రాకపోతే వివేకం లేదు. దైవాన్ని దర్శించాలి, ఆత్మని దర్శించాలి, అనే కాంక్ష ఒక వరద వచ్చినట్టు పెల్లుబుకి మీ హృదయం నుండి రావాలి. అది వివేకానికి గుర్తు, లేకపోతే అది వివేకం కానే కాదు. ఏవండీ బలవంతాన

ఎంతసేపు చేస్తారు, ఇష్టం లేని పనులు ఎంతసేపు చేస్తారు. మీరు ఏదో కృష్ణ నామమో, రామ నామమో, శివ నామమో చేస్తున్నారు అనుకోండి మీరు చేస్తున్న నామం మీద మీకు ఎంతవరకు ప్రీతి ఉంది? మీ దేహాన్ని మర్చిపోయి, మీ మనస్సుని మర్చిపోయి, మీ ఇంద్రియాలను మర్చిపోయి, మీ ఇష్ట దైవాన్ని మీరు ఎప్పుడైనా ప్రేమించారా? ఈ గౌరవాలను మూట కట్టి పక్కన పెట్టి మీ దైవాన్ని మీరు ఎప్పుడైనా ప్రేమించారా? ఆ ప్రేమించే ప్రయత్నంలో మిమ్మల్ని మీరు ఎప్పుడైనా మర్చిపోయారా? మీరు జ్ఞాపకం తెచ్చుకోండి. సత్ చిత్ ఆనందం. ఆత్మ యొక్క స్వరూపాన్ని ఆ ఉనికిని అలా చెప్పారు. భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే మాటలు శాస్త్రంలో అలా చెప్పిన మూలాన ఇవి మూడు వేరు వేరుగా కనిపిస్తున్నాయి కానీ ఇవి మూడూ ఒక్కటే. ఏదైతే సత్తో అదే చిత్ అదే ఆనందం. మూడూ ఒక్కటే. దానినే సత్ అన్నారు. దానినే చిత్ అన్నారు. దానినే ఆనందం అన్నారు. అంటే మనం వేరు అనుకోకూడదు. మూడుగా ఉన్నాయి అనుకోకూడదు. ఒకటిగానే ఉంది. మాటల్లో ఏముందండి? మాటల్లో ఏమి లేదు. ఈశ్వరుడు యొక్క కరుణలో ఉంది. మన ప్రవర్తన నిదానంగా ఉంటే మన ప్రవర్తన సరిగా ఉంటే మనలని కరుణించటానికి సిద్ధంగా ఉన్నాడు ఈశ్వరుడు. ఆయన మాటలకు అందడు, రచనలకి అందడు, ఉపన్యాసాలకు అందడు. పరిశుద్ధమైన జీవితానికి అందుతాడు. మనంఎవరినైనా ఏమైనా అడిగి తెలుసుకోవటానికి మొహమాటం పడతాం. తెలియకపోయినా తెలుసున్నట్టు నటిస్తాం. రాముడు అంతటి వాడు మనం భగవంతుడు అనుకునే రాముడు కోతుల సహాయం అడిగాడు. అవసరం వచ్చినప్పుడు కోతుల సహాయం అడగటానికి ఆయనేమి సిగ్గు పడలేదు. జ్ఞానాన్ని సంపాదించేటప్పుడు కూడా సిగ్గు పడకూడదు. తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి.

స్వరూపదర్శనం ఎప్పుడు అవుతుంది? అంటే మీకు ఆత్మదర్శనం ఎప్పుడు అవుతుంది? నువ్వు ఎప్పుడు మోక్ష స్థితిని పొందుతావు. లోకభావన, దేహభావన ఉన్నంత కాలం వాడికి స్వరూపదర్శనం కాదు. ఎవడికైతే సత్యం దర్శనం అయ్యిందో వాడిలో లోకం లయిస్తుంది. అంటే వాడికి భిన్నంగా లోకం ఉండదు. మనందరికీ వేరుభావన ఉంది లోకం వేరు నేను వేరు అనే వేరుభావన ఉంది. కాని జ్ఞానికి ఆ భావన ఉండదు అంటున్నారు ఎందుచేత అంటే అజ్ఞాని దేహానికి పరిమితం అయ్యి ఉంటాడు. జ్ఞాని దేహానికి పరిమితం అయ్యి ఉండడు. ఎవడైతే దేహానికి పరిమితం అయ్యి ఉన్నాడో వాడికి లోకం వేరుగా కనిపిస్తుంది. దేహభావన ఉన్నప్పుడు వాడికి లోకం వేరుగా కనిపిస్తుంది. ఎప్పుడైతే

దేహం తాను కాదని తెలుసుకున్నాడో దేహం యొక్క limitations ఎప్పుడైతే దాటాడో అప్పుడు వాడిలో లోకం లయిస్తుంది. ఆత్మకి భిన్నంగా లోకం లేదు. తనలో లోకం లయిస్తుంది అంటే ఆత్మలో లోకం లయిస్తుంది. అప్పుడు వేరుభావన పోతుంది. లోకం తనలో లయించకుండా లోకం పట్ల భిన్నభావన కనుక ఉంటే ఈశ్వరుడు పట్ల భిన్నభావన కనుక ఉంటే వాడికి స్వరూపం తెలియదు, వాడికి సత్యం తెలియదు, వాడు జ్ఞాని కాలేడు. నేను వేరు, లోకం వేరు, దేవుడు వేరు, ఈ మూడు భావనలు ఉన్నంతకాలం వాడికి అహంకారం ఉన్నట్టే. అహంకారం దాటితే ఇవి మూడు దాటతాడు. అహంకారం ఉన్నంతకాలం నేను వేరు అనిపిస్తుంది, లోకం వేరు అనిపిస్తుంది, ఈశ్వరుడు వేరు అనిపిస్తాడు. అహంకారం అన్నా, జీవుడు అన్నా, మనస్సు అన్నా, చిజ్జడ గ్రంథి అన్నా, ఇవన్నీ ఒక్కటే. దేహం మాత్రమే నేను అనుకోవడం అహంకారం. ఆ తలంపే అహంకారం. అహంకారం ఉన్నంత సేపు ఇవి మూడు తప్పవు. ఏవి తప్పవు? దేహభావన తప్పదు. ఈశ్వరభావన తప్పదు, లోకభావన తప్పదు. గాఢనిద్రలో అహంకారం లేదు. గాఢనిద్రలో నీకు దేహ స్పర్శ లేదు. గాఢనిద్రలో నీకు ఈశ్వరుడి స్మరణ లేదు. గాఢనిద్రలో నీకు లోకం యొక్క స్మరణ లేదు. ఇదంతా ఎప్పుడు? నేను అనే తలంపు వచ్చిన తరువాత మీరు జాగ్ృదావస్థలోకి వచ్చిన తరువాత ఇవి మూడువస్తున్నాయి కాని గాఢనిద్రలో మీకు ఏమి లేవు. మీ దేవుడు గొడవ కూడా మీకు గాఢనిద్రలో లేదు. అంటే మీకు నిజం ఎప్పుడు తెలుస్తుంది అంటే లోకం నీలో లయం అయినప్పుడు నిజం తెలుస్తుంది కానీ లోకం లయం అవ్వకముందు నీకు నిజం తెలియదు. జ్ఞానం జ్ఞానం అంటే ఏమి లేదు. నిజస్థితిలో ఉండగలగటమే జ్ఞానం. అప్పుడు తెలుస్తుంది శాంతి ఎలా ఉంటుందో. ఏమండీ మన మనసు రోజూ అనేక అవతారాలు ఎత్తుతుంది. ఈ మనస్సుని నమ్ముకుని మనమేమి సాధన చేస్తాం? మీ మనస్సు నిలబడటం కోసం, ఏకాగ్రం అవ్వటం కోసం, సత్పురుషుల సహవాసం చెయ్యమని, పెద్దవాళ్లను ఆశ్రయించమని చెప్పారు. సత్పురుషుల సహవాసం చేస్తే మీ మనసు స్వాధీనంలోనికి వస్తుంది.

అక్కడ ఒక తాడు ఉంది, మనం తాడుని చూసి పాము అనుకున్నాం. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఆ తాడు పాముగా కనిపిస్తున్నంత కాలం నీకు తాడు కనపడదు అన్నారు. మీరు జాగ్రత్తగా వినండి. ఒక తాడు ఉంది. చీకటి కారణంగా కానీ, ఇంకో కారణంగానో ఆ తాడు మనకు పాముగా కనిపిస్తోంది అనుకోండి ఆ తాడు పాముగా

కనిపిస్తున్నంత కాలం మనకి తాడు కనపడదు. మనకి ఎప్పుడైతే తాడు తాడుగా కనపడిందో అప్పుడు పాము కనిపిస్తుందా? అప్పుడు పాము కనపడదు. అదే విధంగా మనం ఆత్మని ఆత్మగా చూడగలిగినప్పుడు ఈ లోకం లేదు, ఏమి లేదు. మీకు పాము దృష్టి ఉన్నంత సేపు ఆ తాడు కనపడదు. తాడు కన్పించిన తరువాత పాము లేదు. అదే విధంగా మీకు ఆత్మ దృష్టి కలిగాక ఆత్మజ్ఞానం కలిగాక, ఆ దైవస్థితిని నువ్వు పొందాక, అప్పుడు ఈ లోకం లేదు. దేవుడు లేడు. నువ్వు లేవు, నేను లేను. అప్పుడు జీవలక్షణాలు అంటూ ఏమి లేవు. అప్పుడు మరణం లేదు, పుట్టుక లేదు, ఏదీ లేదు, చావు లేదు, జన్మ లేదు, ఏమీ లేదు. ఇదంతా దేవుడి కల్పితం కాదు. ఇదంతా మనస్సు యొక్క కల్పితం. సోదరమహాశయులారా! ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఉన్నది ఒక్కటే. అదే ఆత్మ, అదే సత్యం, అదే వైకుంఠం, అదే స్వర్గరాజ్యం, అదే కైలాసం, ఉన్నది ఒక్కటే. దానిని ఎన్ని పేర్ల తోటి పిలవనివ్వండి. ఎన్ని రకాలుగా చూసినా ఉన్నది ఒక్కటే. అది మీ హృదయంలో ప్రత్యక్షంగా ప్రకాశిస్తోంది. నిరంతరం ప్రకాశిస్తోంది. దానికి ఒకప్పుడు ఉండి ఇంకొకప్పుడు లేకపోవటం అంటూ లేదు. అది జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో, సుషుప్తి అవస్థలో, మూడుఅవస్థల్లో సమానంగా ఉంది. అది నార్మల్ గా ఉంది. అది గొప్పగా ఏమి లేదు, అది తక్కువగా ఏమి లేదు. అది natural గా ఉంది. ఎప్పుడైతే నీకు అది అనుభవంలోకి వచ్చిందో హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మని ఉన్నదాన్ని ఉన్నట్టుగా నువ్వు గుర్తించ గలిగితే, అప్పుడు ఏమి తెలుస్తుంది? లేనిది లేనట్టుగా తెలుస్తుంది. ఆ వస్తువు నీకు తెలిసే వరకు లేనిది ఉన్నట్టుగా అనిపిస్తుంది. ఉన్నది లేనట్టుగా అనిపిస్తుంది. అక్కడ తాడు ఉన్నప్పటికీ తాడు లేదు పాము ఉంది అనుకుంటున్నాం, కాని అది తాడు అని తెలిసాక అక్కడ పాము లేదు ఉన్నది తాడే అనుకొంటాము. అదే విధంగా మీరు ఆత్మని తెలుసుకునే వరకు లేనిది ఉన్నదానివలే కనిపిస్తుంది. ఉన్నది లేనిదానివలేకనిపిస్తుంది. జ్ఞానం అంటే ఏమి లేదు. ఉన్నదానిని ఉన్నట్టుగా తెలుసుకోవటమే జ్ఞానం. లేనిదానిని ఏమి కల్పించక్కర్లేదు. లేనిదానిని ఏమి సృష్టించక్కర్లేదు. ఇది కొత్తగా కనిపెట్టేది కాదు. మీరు effort చేసి తెచ్చుకునేది కాదు. ప్రయత్నం చేసి సాధించేది కాదు అది, ఉన్నదానిని నువ్వు తెలుసుకోగలిగితే అది నీ హృదయానికి అందితే, నువ్వు దానిని పట్టుకోగలిగితే అప్పుడు లేనిది లేనట్టు కనిపిస్తుంది. అంతవరకు లేనిది ఉన్నట్టుగా కనిపిస్తుంది. సత్య వస్తువు మన హృదయంలోనే ఉంది, దానిని తెలుసుకునే వరకు మనం మరణించాం అనుకుంటాం, జన్మించాం అనుకుంటాం, ఇలాగ జరుగుతూ ఉంటుంది. నిజాన్ని తెలుసుకునే వరకు నీ మనసు కల్పించటం మానదు అంటున్నారు రమణస్వామి. సత్యాన్ని తెలుసుకునే

వరకు మనస్సు దాని పుట్టుకను అది తెలుసుకునే వరకు మనకు కల్పించడం మానదు. ఇప్పుడు మనం చూడండి చిన్నప్పటి నుంచి మన మనస్సు ఎన్ని రకాలుగా ఎన్ని విషయాలు కల్పిస్తుందో చూడండి. ఇదంతా కల్పనే. తాత్కాలికంగా మీకు ఎవరికి అయినా సుఖం ఉండచ్చు. ఇది ఎప్పుడూ ఉంటుంది అని అనుకోవద్దు. మీ పిల్లలు, మీ మనవలు మిమ్మల్ని సుఖపెడుతూ ఉండచ్చు. కొంతమంది అదృష్ట జీవులు ఉంటారు, కొంతమంది దురదృష్ట జీవులు ఉంటారు. ఏమండీ మనం చేసే పూజలు ఎందుకు? అదృష్టం కొనుక్కోవటానికే కదా! పూజలు, సత్యనారాయణ వ్రతాలు ఇవన్నీ ఎందుకండీ అదృష్టం సంపాదించుకుందాం అనే. అదృష్టం సంపాదించుకుంటే మళ్ళీ జన్మలో మంచి జన్మ వస్తుంది, మంచి ఫలహారాలు తినవచ్చు. భోగాలు అనుభవించవచ్చు. అందుకా అండి మనం చేసేది? అసలు మన లక్ష్యం ఏమిటి? ఏమి సాధించటం కోసం మనం కృషి చేస్తున్నాం? మీరు సాధిస్తారా, సాధించరా అది వదిలేయండి. దేనిని మనం సాధించటం కోసం, దేనిని పొందటం కోసం మనం కృషి చేస్తున్నాం. మన destination ఏమిటి? మన goal ఏమిటి? మన aim ఏమిటి అసలు? అదృష్టం కొనుక్కోవటమా? పోనీ అదృష్టం కొనుక్కున్నారు ఎంతసేపు ఉంటుంది అదృష్టం మీకు. తాత్కాలికంగా మీకు అందరికి సుఖంగా ఉండచ్చు అది నిజం కాదు. కొద్ది రోజులలో జారిపోవచ్చు. వాల్మీకి రామాయణంలో చెప్పాడు ఈ లోకంలో ఎంత అదృష్టం ఉన్నప్పటికీ, మనం ఎంత గొప్ప పదవుల్లో ఉన్నప్పటికీ ఎంత ధనవంతులు అయినప్పటికీ, ఎంత ఐశ్వర్యం ఉన్నప్పటికీ కూడా కాలప్రవాహంలో కొట్టుకు పోకుండా నిలబడే వస్తువు ఒక్కటీ లేదు అన్నాడు. ఎంత విద్యావంతుడు అయినా, ఎంత డబ్బు అయినా, ఎంత అదృష్టం అయినా కాలప్రవాహంలో ప్రతీది కొట్టుకు పోవాల్సిందే. సామ్రాజ్యాలు వెళ్ళిపోయాయి, చక్రవర్తులు వెళ్ళిపోయారు. ఈ కాలప్రవాహంలో ఎవరు మిగలలేదు. అందుచేత ఏది నిజం కాదు. మీరు పూజలు చేసి, జపాలు చేసి, అదృష్టం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అదృష్టం కోసం మనం ప్రయత్నం చేస్తున్నాం, దానిని కొనుక్కోవాలని చూస్తున్నాం కానీ మనకు కావాల్సింది అదృష్టం కాదు. మీరు చేసే పూజల వలన, జపాల వలన అదృష్టం వస్తుంది నేను రాదు అనటం లేదు. అది ఎంతసేపు ఉంటుంది? అది తాత్కాలికంగా సుఖాన్ని తీసుకు రావచ్చు. కొన్ని comforts తీసుకు రావచ్చు. మళ్ళీ దాని వెనకాలే దుఃఖం వచ్చేస్తుంది. అదృష్టం వెనకాల దురదృష్టం కనిపిస్తుంది. ఆ టైంకి అది సుఖంగా కనిపిస్తుంది అది సుఖం కాదు. మీరు ఎప్పుడు సుఖం పొందుతారు అంటే నేను ఎవడను అనే ప్రశ్న వేసుకుని మీ మనసుని నిగ్రహించుకుని ఈ నేను ఎవరు అనే ప్రశ్న ద్వారా మనసుని

స్వాధీనం చేసుకుని మీ మనసుని ఆత్మాకారం పొందింపచేస్తే అప్పుడు మీకు జ్ఞానం కలిగితే అప్పుడు సుఖం అంటే ఏమిటో మీకు తెలుస్తుంది. శాంతి అంటే ఏమిటో మీకు తెలుస్తుంది కాని, మీకు ఉన్న సంపదలను బట్టి, మీకు ఉన్న పదవులను బట్టి, మీకున్న అదృష్టాన్ని బట్టి వచ్చే తాత్కాలికం అయిన సుఖం సుఖం కాదు. తాత్కాలికంగా మీకు సుఖంగా ఉన్నామని అనిపించినా అది జారిపోతుంది. అది స్వప్నం లాంటిది, అది నిజం కాదు. అది నిలబడదు. దానిని పట్టుకుని వేలాడకండి, అది నిజం అని నమ్మకండి అని చెబుతున్నారు. ప్రమాదం ఎక్కడ వచ్చింది అంటే తాడుని పాము అనుకున్నా ఫరవాలేదు. కాని మనం ఏమి చేస్తున్నాం అంటే పాముని తాడు అనుకుంటున్నాం. తాడుని పాము అనుకుని దానిని ముట్టుకున్నా ఫరవాలేదు. కాని పాముని తాడు అనుకుని పాముని ముట్టుకుంటే ఏమి అవుతుంది. మనం ప్రమాదంలో పడతాము.

మనం లోకాన్ని ఆత్మ అనుకుంటున్నాం. మన పీక అక్కడ పట్టుకుంది. బంధం అక్కడ పట్టుకుంది. పాముని చూసి తాడు అనుకుంటే ఎంత ప్రమాదమో ఈ లోకాన్ని చూసి ఆత్మ అనుకోవటం వల్ల మనం చిక్కుల్లో పడ్డాం. దానివలన మనకి దుఃఖం వస్తుంది. దానివలన మనకి ఈశ్వర అనుగ్రహం రావటం లేదు. మీకు అందరికి శాంతి కావాలి. ఏ కారణం వల్ల మీకు అశాంతి వస్తోంది చెప్పండి. భగవంతుడు చెబుతున్నాడు కదా, జ్ఞాని చెబుతున్నాడు కదా మీరు ఆత్మ స్వరూపులు అని, మీరు ఆత్మ స్వరూపులు అయితే మీకు అశాంతి ఎందుకు వస్తుంది? సాధనలు అవి బాగా చేస్తున్నారా మీరు, మీరు చేసే సాధనలు, మీరు చేసే జపాలు, ఏమి సాధనలు అవి? భగవాన్ అనేవారు అందరూ గజ ఈతగాళ్ళే కానీ ఎవ్వరూ గజం కదలటం లేదు. మీరు పెద్ద పెద్ద సాధనలు, యోగాభ్యాసాలు చేస్తున్నారు కాదు అనటం లేదు కానీ ఈ సాధనలు చేసి, ఇన్ని శాస్త్రాలు చదివి, ఇంత కష్టపడి మీరు చెయ్యగలిగే ప్రయత్నాలు చేస్తున్నారు కదా, దేవాలయాలకు వెళుతున్నారు, ఇంత కష్ట పడుతున్నారు కదా ఒక్క అంగుళం హృదయం వైపుకి ఎవరైనా దిగారా? మీ గుండెల మీద చెయ్యి వేసి చెప్పండి. భగవంతుడు మన హృదయంలో ప్రకాశిస్తుంటే ఆ హృదయం వైపుకి మీ మనస్సుని ఒక అంగుళం తిప్పారా? హృదయం వైపుకి కనీసం ముఖం తిరిగిందా? మనసు యొక్క ముఖం తిరిగిందా? కొంతమంది తోటి మనిషిని అసహ్యించుకుంటారు, నేను భక్తుడని అని చెప్పుకుంటారు, నేను దేవుడిని ప్రేమిస్తున్నాను అని చెప్పుకుంటారు. అది ఎంత అబద్ధమో చూడండి, నడవడమే చేతకాని వాడు పరుగు ఎలా పెడతాడు అండి.

కనిపించే మనిషినే ప్రేమించలేనివాడు కనిపించని దేవుడిని ఎలా ప్రేమిస్తాడు. అది అబద్ధం. ఒకవేళ నిజం అని ఎవడైనా చెబితే అది అబద్ధం. మీ మనస్సుని అంతర్ముఖం ఎవడు చేయగలుగుతున్నాడో వాడే మీ గురువు. భగవాన్ తోటి ఒకరు చెప్పారు స్వామి స్వామి మీ రాతి విగ్రహం మద్రాసులో తయారు అవుతోంది అని. అప్పుడు భగవాన్ అన్నారు అవును నిజమే, రాతి మనుషులు అందరికి రాతి విగ్రహాలు కావాలి. రాతి మనుషులకి, రాతి మనసులకి, రాతి విగ్రహాలు ఉండాలి. దేవుడికి నైవేద్యాలు పట్టుకెళుతున్నాం. ఎందుకు పట్టుకెళుతున్నాం ఆయన తినడు కాబట్టి నిజంగా తింటే మనం పట్టుకెళ్లం. ఆయనకు చూపించి మనం ఇంటికి తెచ్చుకోవడమే కదా. నిజంగా తింటున్నాడు అనుకోండి అసలు మనం తీసుకొని వెళ్ళము.

మనస్సు ఉన్నంత సేపు లోకం ఉంటుంది. మనస్సు ఉన్నంతసేపు జన్మలు ఉంటాయి. మనస్సు ఉన్నంత సేపు దేహాలు వస్తాయి. మనస్సు ఉన్నంతసేపు పుణ్యం ఉంటుంది, పాపం ఉంటుంది, సుఖం ఉంటుంది, దుఃఖం ఉంటుంది, మనస్సు ఉన్నంతసేపు ఇదంతా continue అవుతూ ఉంటుంది. మోక్షం కావాలి మోక్షం కావాలి అంటే ఎవరికి మోక్షం? దేహానికా మోక్షం? మోక్షం అంటే ఏమిటి? విడుదల. దేనిలోంచి విడుదల? బంధం లోంచి విడుదల. ఏది బంధం? నేను దేహమాత్రున్ని అనుకోవడం బంధం. హిందూమతంలో ఒక సాంప్రదాయం ఉంది ఆ సాంప్రదాయం వాళ్ళు ఏమి అంటారు అంటే మీకు మోక్షం కావాలి అంటే వైకుంఠం కావాలి అంటే ముందు మీరు చావాలి అని. మీరు చచ్చిపోయిన తరువాత గాని మీకు మోక్షం రాదు అంటారు. అదేగనుక నిజం అయితే మన పెద్దలు ఋషులు చెప్పినవి అన్నీ, వ్రాసినవి అన్నీ అబద్ధాలా? వారు మోక్షంలో ఉండి రాశారా? మోక్షంలో లేకుండా రాశారా? మోక్షంలో లేకుండా రాస్తే నిజం ఎలా రాయగలరు. వాళ్ళు మోక్షంలో ఉండి, ఆత్మస్థితిలో రాయగలిగారు కాబట్టే అది ఉపనిషత్తు అయ్యింది. అంటే మీరు ఇప్పుడే పొందచ్చు, ఇక్కడే పొందచ్చు. అది always రెడీ, always present అది. అది ఎప్పుడు ఉండనే ఉంది. ఆ వస్తువు నీ కోసం కనిపెట్టుకుని ఉంది. అదే రామకృష్ణ పరమహంస చెబుతారు నువ్వు ఒక్క అడుగు ఎదరకి వేస్తే అది నీకోసం పది అడుగులు ఎదరకి వేస్తుంది. మీరు ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకోండి. మనలో ఉన్న ఆత్మ కంటే మనలని ప్రేమించేవాడు ఎవడు లేడు. మీ మనస్సు అంతర్ముఖం అయితే అప్పుడు తెలుస్తుంది. నేను ఎప్పుడో పొందుతాను అనే వస్తువు ఇప్పుడే పొందాను. భగవాన్ చెబుతారు ఈ

అహంకారానికి రూపం కావాలి. చిన్నపుడు తల్లిని పట్టుకుంటుంది. తరువాత భార్య. తరువాత పిల్లలు. తరువాత మనవలు. తరువాత పొలాలు. తరువాత బ్యాంకులో డబ్బు. ఏదొక రూపాన్ని పట్టుకుంటూ ఉంటుంది. చివరికి మరణించేటప్పుడు కూడా అది రూపాన్ని పట్టుకునే మరణిస్తుంది. దానికి రూపం కావాలి. అహంకారానికి మేత రూపం. మనం సాధన దేనితోటి చేస్తాం? మనసు తోటి చేస్తాం. భగవాన్ ఏమి అంటారు అంటే సాధన చెయ్యటానికి మనస్సు ఉందా? మనస్సు ఉంటే సాధన చేస్తావు. సాధన చేయటానికి అసలు మనస్సు ఉందా నీకు? పోనీ మనస్సు ఉంది. మనస్సు తోటి సాధన చేస్తే మనస్సు లొంగుతుందా నీకు? ఒక వ్యాపారి ఇంట్లో ఒకడు దొంగతనం చేశాడు. యజమాని ఏమి చేశాడు ఆ దొంగవాడిని కేకేసి మా ఇంట్లో ఒక వస్తువు పోయింది. దొంగవాడు ఎవడో తెలియటం లేదు. మీరు కొంచెం enquiry చేసి పెట్టాలి అన్నాడు. ఎవరిని? ఆ దొంగతనం చేసిన వాడినే. వాడే దొంగతనం చేశాడు అని వీడికి తెలియదు పాపం. వాడు ఏమంటున్నాడు అంటే ఏవండీ కంగారు పడకండి నేను తెలుసుకుని వాడిని పట్టుకుని మీకు చెబుతాను అన్నాడు. వాడే దొంగ వాడు నిజంగా దొంగవాడిని పట్టుకుంటాడా? వాడు దొంగవాడిని పట్టుకోనే పట్టుకోడు. వాడు దొరకనే దొరకడు. మనసు చేసే సాధన అంతే అన్నాడు. ఈ మనస్సే దొంగ. జపం చేస్తుంది. ధ్యానం చేస్తుంది ఇవన్నీ చేస్తుంది. ఇన్ని చేసి ఆత్మను తెలుసుకోవడానికి అది ప్రయత్నం చేస్తుందా? చెయ్యదు. ఎందుచేత అంటే ఆత్మను తెలుసుకుంటే నేను ఏమైపోతానో అని. మనసుకి అన్నీ కావాలి దేశంలో గొడవలు, ఊర్లో గొడవలు, అన్ని గొడవలు కావాలి కానీ ఆత్మ అక్కర్లేదు. ఎందుచేతనంటే ఆత్మ నిజం. నిజం తెలుసుకుంటే దీనికి అస్తిత్వం ఉండదు. సోదరమహాశయులారా ఒక్కటి మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఉన్నది ఒక్కటే మిగతావి అన్నీ సున్నలు. సున్నలకి విలువ ఉందా? మనకి రాముడు జ్ఞాపకం వస్తే అయోధ్య జ్ఞాపకం వస్తుంది. కృష్ణుడు జ్ఞాపకం వస్తే మధుర జ్ఞాపకం వస్తుంది. అక్కడ కూడా మనసు బహిర్ముఖం అవుతుంది. మీరు ఒక్కసారి ఆలోచించండి. ఏ కారణం వల్ల మీకు అశాంతి వస్తోంది? మీరు పైకి చెప్పొద్దు. ఏ కారణం వల్ల మీకు అశాంతి వస్తుంది? నాకు దేవుడు కావాలి అని మీరు ఎవరైనా అంటున్నారు అనుకోండి మీకు దేవుడి తోటి పని ఏమిటి? మీకు అనేక ఆలోచనలు వస్తు ఉంటాయి అనేక తలంపులు వస్తు ఉంటాయి. ఆ తలంపుల మూటే మనస్సు. ఆ తలంపులు తీసేస్తే మనస్సు అనే పదార్థం ఏమి లేదు. కొంతమందిని చూస్తే మీకు కోపం వస్తుంది అనుకోండి ఎందుకొస్తోంది కోపం? అది కోపం కాదు పైకి కోపం వలే కనిపిస్తుంది.

లోపల ద్వేషం ఉంటుంది. పైకి కనిపించేది ఒక్కటి, లోపల ఉండేది ఒక్కటి. మన భక్తి కూడా అంతే బయటికి కనిపించేది ఒక్కటి, లోపల ఉండేది ఒక్కటి. భగవాన్ అనేవారు దేవుడు వచ్చి మింగుతాను అంటే ఎవడు ఇష్టపడడు. వాడిని మింగనివ్వడు, వీడే దేవుడిని మింగటానికి ప్రయత్నం చేస్తాడు. ఎంత భక్తో చూడండి. కొంచెం కొంచెం స్వార్థం. కొంచెం కొంచెం ప్రేమ. కొంచెం కొంచెం ఏదోకటి మీకు లోకానికి సంబంధించినవి కనబడాలి. లేకపోతే పని చేయలేరు. మీరు ఈ ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకోండి తరువాత సాధన చేద్దురు గాని. మనం స్వార్థం కోసం ఏ పని చేసినా మళ్ళీ రాబోయే జన్మలలో దీంట్లోంచి విడుదల పొందటం కోసం ప్రయత్నం చెయ్యాలి. ఏదైతే మనం కల్పించు కుంటున్నామో ఏదైతే మనం ముడి వేసుకుంటున్నామో మళ్ళీ దానిని విడదీయటానికి కొన్ని లక్షలాది జన్మలు పడుతుంది. మనం వేసుకున్న ముడులు అన్నీ కూడా మనమే విప్పుకోవాలి. మనం చేసే జపం పరమార్థాన్ని అందుకోవటం కోసమా? లేకపోతే స్వార్థాన్ని సంతృప్తి పరచటం కోసమా? మీకు వచ్చే ప్రతీ తలంపుని రాచిరంపాన పెట్టాలి. ఆ తలంపు ఎందుకు వచ్చింది? లోపల వాసన ఉంటే తలంపు వచ్చిందా? వాసన లేకుండా తలంపు వచ్చిందా? అసలు ఆ తలంపు ఎందుకు రావాలి? ఆ తలంపుకి మూలం ఏమిటి? అని ఆ తలంపు యొక్క మూలాన్ని అన్వేషించాలి. పూర్వజన్మలకి సంబంధించిన సంస్కారం మనలో లేకపోతే దానికి సంబంధించిన వాసన మనలో లేకపోతే ఆ తలంపు రానే రాదు.

తలంపే జగత్తు. తలంపు వచ్చిన తరువాతే ఏదైనా కనిపిస్తుంది. బంధించేది కూడా తలంపే. దుఃఖం వస్తున్న మాట నిజమే. ఎలా వస్తుంది ఆ దుఃఖం మీకు? తలంపే. నా మనస్సు ఆగమంటే ఆగటం లేదు. మనస్సుని నిలబెట్టుకోలేకపోతున్నాం. మనస్సు కదిలి పోతోంది అని ఎవరైనా అంటే భగవాన్ అనేవారు మీ మనస్సుని ఆగమంటున్నారు. ఆగటం లేదు. కదిలిపోతోంది. నా మనస్సుని కదలమంటున్నాను. కదలమన్నా అది కదలటం లేదు. ఏమండీ ఈ పెద్ద పెద్ద కబుర్లు చెప్పేవాళ్ళు అందరికి మేము మేధావులం అని చెప్పుకునే వాళ్ళు అందరికి దేవుడు లేడు, ఎవడు లేడు అని చెప్పేవాళ్ళు అందరికి వాడి తలంపు వాడి స్వాధీనంలో ఉందా? తనకొచ్చే తలంపు తన చేతిలో ఉందా? మీరు ఆలోచించాలి. నా తలంపు నా చేతిలో ఉందా? ఇంక ఏమిటి నేను సాధించింది? అసలు నాకు వచ్చే తలంపు నా చేతిలో ఉందా? మరి మీ చేతిలో ఉంటే మిమ్మల్ని విడిచి పెట్టి ఎందుకు వెళ్ళటం లేదు? ఈ విషయాలు ఎప్పుడైనా మీరు ఆలోచించారా? మనకి స్వాతంత్ర్యం ఉందా? మేము స్వతంత్రులం అంటున్నారు కదా దేంట్లో స్వాతంత్ర్యం? ఏ విషయంలో

స్వాతంత్ర్యం? మన తలంపుల్ని అదుపులో పెట్టుకునే శక్తి కూడా మనకి లేదే? ఎందులో స్వతంత్రులం అయ్యాం? ఒక ఇంగ్లీషు కవి ఒక మాట చెప్పాడు స్వతంత్రుడు కాని వాడు మోక్షాన్ని పొందలేడు.

మనకి ఎవరికి అయినా స్వాతంత్ర్యం ఉందా అసలు. కొంతమందిని చూస్తే ప్రీతి ఉంది, కొంతమందిని చూస్తే అప్రీతి ఉంది. అంతేకదా, కొంతమందిని చూస్తే రాగం, కొంతమందిని చూస్తే ద్వేషం. ఇది స్వాతంత్ర్యమా? చెప్పండి మనం ఎవరిమైన స్వతంత్ర్యంగా ఉన్నామా? స్వతంత్ర్యం లేనివాడికి మోక్షం ఏమిటి? స్వతంత్ర్యం లేనివాడికి సుఖం ఏమిటి? ఈ మనస్సు ఏమి చేస్తుంది అంటే పూజలు చేయమంటే చేస్తుంది. అప్పుడప్పుడు కాశీ వెళ్ళి, రామేశ్వరం వెళ్ళి, అరుణాచలం వెళ్లి పూజలు చేయమంటే చేస్తుంది. డబ్బులు ఉంటాయి కాబట్టి అటు ఇటు వెళ్ళిపోతుంది. కాని నువ్వు ఎవడవు? అంటే మటుకు నా జోలికి రాకు అంటుంది. అన్ని మంచి పనులు చేస్తూ ఉంటుంది కాని నువ్వు ఎవడవు అని మనస్సుని అడిగితే నా జోలికి రాకు అంటుంది. అంటే దాని అస్థిత్వానికి భంగం లేని పనులు అన్నీ చేస్తుంది. దాని అస్థిత్వాన్ని ప్రశ్నించామా? నువ్వు ఎవడవు అని అడిగామా అది మనకు ఎదురు తిరుగుతుంది. దాని జోలికి వెళ్ళకుండా రామా రామా అనమంటే అంటుంది, గుడులు కట్టించమంటే కడుతుంది, మనం చెప్పిన అన్ని పనులు చేస్తుంది. కాని ఒక్కటే నా జోలికి మటుకు నువ్వు రాకు. నువ్వు ఎవడవు అని ప్రశ్నించకు అంటుంది. ఒకటి మీరు జ్ఞాపకం పెట్టుకోండి లోకంలో మనకు ఉన్న శత్రువులు అందరు కలిపి పెట్టలేని బాధ మన మనసు మనకి పెడుతుంది. మన మనస్సు మనకి తీసుకు వచ్చే దుఃఖం, మన మనస్సు మనల్ని పెట్టే బాధ మన మనస్సు ద్వారా మనకి వచ్చే హింస లోకంలోని శత్రువులు కూడా అంత బాధ మనకి తీసుకు రాలేరు. అందుకే కృష్ణుడు గీతలో ఏమి చెప్పాడు అంటే నీ మనస్సే నీకు స్నేహితుడు, నీ మనస్సే నీకు విరోధి. అందుచేత నీ మనస్సుని మచ్చిక చేసుకో, మనస్సుని స్వాధీనం చేసుకుంటే అది నీ స్నేహితుడిలా ఉపకారం చేస్తుంది. మనస్సుకు ఎదురు తిరిగితే శత్రువులా అపకారం చేస్తుంది. శత్రువు అంటే ఎక్కడా లేడు. నీ మనస్సే శత్రువు, మిత్రుడు ఎవడు లేడు. నీ మనస్సే మిత్రుడు. అందుచేత నీ మనస్సుని స్వాధీనం చేసుకో. వైరాగ్యం లేకపోతే అది లొంగదు. అభ్యాసం లేకపోతే అది లొంగదు. వైరాగ్యాన్ని సంపాదించుకో, అభ్యాసాన్ని అలవాటు చెయ్యి. మనకి దేవుడు కావాలి, జ్ఞానం కావాలి కాని వైరాగ్యం లేదు, అభ్యాసం లేదు. ఒకటి మీరు దృష్టిలో పెట్టుకోండి వైరాగ్యం


లేనివాడికి మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఒక మనిషికి తన మనస్సు అంతర్ముఖం అవ్వటం లేదు అంటే ఆ మనిషికి వైరాగ్యం లేనట్టు. మనస్సుని ఎలా అండి నిగ్రహించుకోవటం అని భగవాన్‌ను అడిగితే మనస్సు ఉంటే నిగ్రహించుకోవటం అది ఎక్కడ ఉంది అనేవారు. జీవుడు అంటే వేరుపాటుగా లేడు, మనస్సునే జీవుడు అంటున్నారు. మనకి ఉన్నవి జీవ లక్షణాలా? దైవ లక్షణాలా? జీవ లక్షణాలే. కొంతమంది అంటూ ఉంటారు ఈ మధ్య కర్మ అనుభవిస్తున్నాం అంటారు, ఏదో కష్టం వచ్చినప్పుడు విధి వెంటాడుతోంది మమ్మల్ని, ఆ విధి మమ్మల్ని ఇలా చేసింది అని చెబుతారు. మిమ్మల్ని వెంటాడే విధిని ఆ బరువుని ఈశ్వరుడు మీద వేస్తే ఆయన మోస్తాడు. ఆయన మోయలేని బరువు అంటూ ఏమి లేదు. ఈశ్వరుడు సృష్టినే మోస్తున్నాడు, మీ ఒక్కరి బరువు మోయలేడా? అదే భగవాన్ చెప్పారు రైలులో ఒక పాసింజర్ పెట్టెని తన నెత్తిమీద పెట్టుకుని కూర్చొన్నాడు, ఏమయ్యా ఏమిటి నీ నెత్తిమీద పెట్టుకున్నావు అంటే క్రింద పెట్టను అది రైలుకి బరువు అయిపోతుంది అన్నాడట. నెత్తిమీద ఉన్నప్పుడు కూడా ఆ బరువు ఎవరు మోస్తున్నారు? రైలే మోస్తుంది. కాని నెత్తిమీద నుంచి కింద పెట్టినా రైలే మోస్తుంది. భగవాన్ ఏమి చెబుతున్నారు. ఈ విధిని నేను అనుభవిస్తున్నాను అనుకున్నప్పుడు కూడా ఈశ్వర సంకల్పం ప్రకారం ఇదంతా జరుగుతోంది. నువ్వు చేయవలసింది ఏమిటి? నీ విధిని, నీ ప్రారబ్ధాన్ని నువ్వు అనుభవించే దానిని, ఈశ్వరుడు మీద పడేయ్. అప్పుడు హాయిగా ఉంటుంది. రైలులో ఎవడైనా తన పెట్టెను తన నెత్తిమీద పెట్టుకుని ప్రయాణం చేస్తున్నాడు అనుకోండి మనం ఏమి అనుకుంటున్నాం తెలివి తక్కువ వాడు మూర్ఖుడు అనుకుంటున్నాం. మన దైనందిన జీవితంలో అదే పని మనం చేస్తున్నాం అని చెప్పారు రమణస్వామి. మనకి ఏ విషయంలో అయినా సరే దుఃఖం కలుగుతూ ఉంటే వ్యక్తి భావన మనలో ఉన్నట్టే. వ్యక్తిభావన ఉంటే మనకి జ్ఞానం కలగదు. నేను దేహం లోపల ఉన్నాను. నా దేహం బయట ప్రపంచం ఉంది. ఇంకోచోట ఎక్కడో దేవుడు ఉన్నాడు. అలా వ్యక్తి భావన ఉన్నంత కాలం వాడికి జ్ఞానం కలగదు. శాస్త్రం చెప్పినా, గురువు చెప్పినా, ఏ ఆచార్యుడు చెప్పినా, ఒక్కటే. నీ మనస్సుని అంతర్ముఖం చెయ్యటానికి శాస్త్రం కాని గురువు కాని సహాయం చేయలేకపోతేఅది శాస్త్రం కాదు, వాడు గురువు కాదు. నీ మనస్సుని అంతర్ముఖం చేయటానికి సహాయపడేవాడే గురువు. మీరు ఒక తలంపుని జయించాలి అనుకుంటారు అనుకోండి దాని ప్రతిపక్షాన్ని తీసుకొచ్చి పెట్టండి. వ్యతిరేకభావన ప్రవేశ పెడుతూ ఉండాలి.

ఒక వ్యక్తి మీద ద్వేషం కలుగుతోంది అనుకోండి. ఆ వ్యక్తి మీద ప్రేమ కలగటం లేదు అనుకోండి. అంటే ఏ తలంపు అయితే నిన్ను ఇబ్బంది పెడుతోందో దానికి opposite పెట్టండి. అది వ్యతిరేకభావన. ఆ వ్యతిరేకభావనని ప్రాక్టీస్ చేయండి ఇది పోతుంది. అప్పుడు మీ మనస్సు బహిర్ముఖం అవ్వడం ఆగిపోతుంది. అదే నేను చెప్పేది. ఏ తలంపు అయితే మిమ్మల్ని లోకంలోనికి తీసుకొనిపోతోందో దాని ప్రతిపక్షాన్ని తీసుకు రండి. Opposite తలంపుని తీసుకురండి. Opposite తలంపుని కనుక మీరు ప్రాక్టీస్ చేస్తే ఈ తలంపు పోతుంది, అప్పుడు మీ మనస్సు నిర్మలం అవుతుంది. మీ మనస్సు నిర్మలం అయ్యే కొలది, మీ మనస్సు సూక్ష్మం అయ్యేకొలది అది ఆత్మాకారం చెందుతుంది. మన మనస్సులో ఇంకొకటి ఉంది అది ఎప్పుడు రంధ్రాన్వేషణకి అలవాటు పడిపోయింది. చెడ్డను చూసినంత తేలికగా మంచిని చూడదు. సర్వసాధారణంగా లోకంలో చూడండి ఎంత కోపంరా వాడికి దూర్వాసుడు అంత కోపం అంటాం. అంటే చెడ్డ ఎక్కువ చూస్తుంది మన మనస్సు. మనస్సుకి అబద్ధమే కావాలి ఎందుచేత? అది కూడా అబద్ధమే కాబట్టి అది అబద్ధాన్ని ప్రేమిస్తుంది. లోకం ఎంతసేపు ఏమి చూస్తుంది, దూర్వాసుడులో చెడ్డ చూస్తుంది. కాని దూర్వాసుడు కామాన్ని నూటికి నూరు పాళ్ళు జయించాడు. అది ఎవరు చెప్పరేంటండి. ఆయనలో ఉన్న మంచి ఎందుకు చెప్పదు మనస్సు. మన మనస్సు చేసే మోసం అదే. నువ్వు దూర్వాసుడులో ఉన్న కోపం చెబుతున్నావు, దూర్వాసుడు జయించినవి ఎందుకు చెప్పవు? అది నీ కళ్ళకు కనపడటం లేదా? ఉన్నా కాని గుర్తించవా నువ్వు? సహృదయం కనుక మనకి లోపల లేకపోతే కళ్ళు ఉండి చూడలేము, చెవులు ఉండి వినలేము. ఏ బలహీనత అయితే నీలో ఉందో, ఏ కారణం వల్ల మీ మనస్సు బహిర్ముఖం అవుతుందో మీరు చూసుకోండి. పైకి మీరు ఎవరు చెప్పొద్దు. ఏ కారణం వల్ల మీ మనస్సు బహిర్ముఖం అవుతుందో మీరు చూసుకోండి. అది diagnose చేసుకోండి. చేసుకుని దానికి opposition పెట్టండి. దానికి వ్యతిరేకం అయిన భావన ప్రాక్టీస్ చేయండి ఇది సన్నగిల్లి పోతుంది. ఇది సన్నగిల్లిపోతే ఏమి అవుతుంది perfection కలుగుతుంది. అప్పుడు పూర్ణ స్థితిని పొందుతాడు. విశ్వామిత్రుడికి వశిష్టుడు మీద విపరీతమైన కోపం ఉండేది. ఒకసారి వశిష్టుడు, వశిష్టుడి భార్య కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఆ రోజున పౌర్ణమి ఇద్దరు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వశిష్టుడు దగ్గరకు విశ్వామిత్రుడు వస్తున్నాడు. కాని విశ్వామిత్రుడికి లోపల వశిష్టుడు మీద ఉన్న వ్యతిరేక భావన పూర్తిగా పోలేదు. వశిష్టుడి భార్య అంటుంది “ఈ వెన్నెల ఎంత బాగుంది, ఎంత నిర్మలంగా ఉంది వెన్నెల” అని వశిష్ఠుడితో చెపుతోంది. అప్పుడు వశిష్టుడు “నిజమే

విశ్వామిత్రుడి కీర్తి ఎంత నిర్మలంగా ఉందో, ఎంత స్వచ్ఛంగా ఉందో ఈ వెన్నెల కూడా అలాగే ఉంది" అన్నాడు. ఇంత గొప్ప అభిప్రాయం తనమీద వశిష్టుడికి ఉందని ఆయనకీ తెలియదు. అప్పుడు విశ్వామిత్రుడికి ఉన్న కోపం సడన్‌గా పోయింది. కొంతమంది పని అవ్వటం కోసం ఎదురుగా పొగుడుతారు, చాటున తిడతారు. బజారు సంగీతం, బజారు మాటలు మనకి వద్దు. మనకి అది కాదు కావల్సింది. ప్రత్యక్షంగా కాదు, పరోక్షంగా వశిష్టుడు తన భార్య తోటి చెబుతున్నాడు. ఏమని? "నువ్వు చెప్పినట్టు వెన్నెల చాలా బాగుంది. వెన్నెల చాలా నిర్మలంగా ఉంది. వెన్నెల చాలా ప్రశాంతంగా ఉంది." ఎలా ఉంది అంటే ఆ పోలిక చూడండి విశ్వామిత్రుడి కీర్తి ఎంత నిర్మలంగా ఉందో ఈ వెన్నెల కూడా అలాగే ఉంది. ఈ మాట విన్నాడు అంతే తనకి ఉన్న కక్ష అమాంతంగా కరిగిపోయింది విశ్వామిత్రుడికి. సెకనులో ఆ మాట చెవిన పడటం తోటే ఆయన అనవసరంగా అకారణంగా పెంచుకున్న ద్వేషం, అకారణంగా పెంచుకున్న కక్ష ఒక్క సెకనులో కరిగిపోయింది. ఒక చిన్న మాట, మాటకి అంత శక్తి ఉంది. అందుకే ప్రతిపక్ష భావాలు ప్రాక్టీస్ చేయమని చెబుతున్నాను. అలా చేయటం వలన సడన్‌గా మీలో ఉన్నటువంటి గూడు కట్టుకున్నటువంటి మీ కుయుక్తులు, మీ కుతంత్రాలు, మీ కుచేష్టలు అన్నీ కూడా కూలిపోతాయి. ఎందుచేత చెబుతున్నాను అంటే ద్వేషం వల్ల కూడా మనసు బహిర్ముఖం అవుతుంది. ఆ ద్వేష కారణం తీసేస్తే మనసు ఇంక బహిర్ముఖం అవ్వదు అందుచేత ఆ కారణం తీసేయాలి.

**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**
**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**
**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**
**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**
**పేరు తలపగనే పట్టి లాగితివి నీ మహిమ కనుదురెవరు అరుణాచలా**
**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**
**నీవు నే నణగనిత్యానందమయముగా నిలుచు స్థితికరుణింపు అరుణాచలా**
**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**
**ఏటి కీ నిదుర నన్నితరులులాగగ ఇది నీకు న్యాయమా అరుణాచలా**
**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**
**కుట్ర యంతయుగోసిగుణముగబాలించు గురు రూపమై వెలుగు అరుణాచలా**
**అరుణాచలశివఅరుణాచలశివఅరుణాచలశివ అరుణాచలా**

# భగవాన్ అవతార విశేషము



భక్తి మార్గం మంచిదే కానీ అందులో మూఢనమ్మకాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కర్మమార్గానికి జ్ఞానమార్గానికి సపోర్టుగా భగవంతుడు భక్తిమార్గాన్ని చెప్పాడు, భక్తియోగం భగవద్గీతలో చెప్పారు. మీరు ఏదైనా పని చెయ్యాలంటే ప్రేమగా చెయ్యాలి. పని చేసేటప్పుడు అక్కడ భక్తి ఉండాలి, ప్యూరిటీ ఉండాలి. భక్తి లేకపోతే ఆ పనిని మీరు శ్రద్ధగా చేయలేరు. కర్మ చేయటానికి కూడా కొంత డివోషన్ అవసరం, ఫెయిత్ అవసరం, లవ్ అవసరం. భక్తి మార్గం దానికి ఉపయోగ పడుతుంది. అలాగే మీరు జ్ఞానం సంపాదించటానికి డివోషన్ అవసరం. "డివోషన్ ఈజ్ మదర్ ఆఫ్ జ్ఞాన" అంటే, భక్తి అనే తల్లి లేకపోతే జ్ఞానం రాదు అని భగవాన్ చెప్పేవారు.

అయితే భగవాన్ ఈ భూమి మీదకి ఎందుకు వచ్చారు. కారణం ఏమిటి? శంకరుల తరువాత దేశంలో భక్తిని గురించి చెప్పే ఆచార్యులు ఎక్కువమంది వచ్చారు. జ్ఞానమార్గం మరుగున పడిపోయింది. యజ్ఞాలు, యాగాలు, వీటికి ప్రాముఖ్యత పెరిగిపోయింది. మనిషి బాగుపడటానికి కొంత హేతువాదం అవసరం. రీజన్ అవసరం. మనం రీజనుని విడిచి పెట్టకూడదు. గురుజాడ అప్పారావుగారు ఏమన్నారు అంటే గౌతమబుద్ధుడి సబ్జెక్టు అంతా ఇండియా నుంచి బయటికి పంపేశారు. అసలు మనిషి రీజన్ విడిచిపెట్టకూడదు, హేతువాదం విడిచిపెట్టకూడదు. హేతువాదాన్ని విడిచిపెడితే మనల్ని మనం ఆత్మహత్య చేసుకున్నట్టు అవుతుంది అన్నారు. ఇప్పుడు నేనే (నాన్నగారు) ఏదో చెపుతున్నాను. ఇందులో ఎంతవరకూ ట్రూత్ ఉంది, ఎంతవరకూ ఉపయోగపడుతుంది, అని మీకు ఆ లాజికల్ థింకింగ్ ఉండాలి. మన మెదడుని కూడా మనం ఉపయోగించుకోవాలి. అంటే హేతువాదాన్ని మీరు వదిలేస్తే, మిమ్మల్ని మీరు హత్య చేసుకున్నట్టు అవుతుంది అని గురుజాడ అప్పారావుగారు చెప్పారు.

భక్తిమార్గంలో శ్రీకృష్ణచైతన్య వచ్చాడు, తరువాత ఇంకా చాలా మంది వచ్చారు. సౌత్ లో (దక్షిణాదిలో) కూడా ఆళ్వారులు చాలా మంది వచ్చారు. అది ఇండిపెండెంట్ మార్గం అయినా అవ్వకపోయినా, జ్ఞానమార్గానికి కర్మమార్గానికి సపోర్ట్‌గా ఉంది భక్తిమార్గం. మీరు జ్ఞానం సంపాదించాలన్నా డివోషన్ ఉండాలి, సెల్ఫ్ లెస్ వర్క్ చెయ్యాలన్నా డివోషన్ ఉండాలి. ఒక మనిషి మీద మీకు ఆప్యాయత లేకుండా ప్రేమ లేకుండా ఆ వర్క్ ఎలా చెయ్యగలరు, చేయలేరు! అందుచేత కర్మమార్గానికి జ్ఞానమార్గానికి కూడా డివోషన్ అవసరం.

శంకరులు వచ్చి జ్ఞానమార్గం బోధించారు. ఆచార్యులవారు జ్ఞానం గురించి చెప్పారు కానీ, శాస్త్రం గురించి కూడా ఎక్కువ చెప్పారు. అంటే శాస్త్రాన్ని మనం ప్రమాణంగా పెట్టుకోవాలని చెప్పారు, అంతవరకూ బాగానే ఉంది. తరువాత పాండిత్యమే జ్ఞానము అనేటటువంటి భావన వచ్చేసింది. మీరు సంస్కృతం బాగా నేర్చుకుంటే, వేదం బాగా నేర్చుకుంటే, మీరు ఇంక జ్ఞానులు అనే భావన వచ్చింది దేశంలో. సంస్కృతం ఎందుకు నేర్చుకోమని మనకు చెప్పారంటే భారతీయ వేదాంత వాఙ్మయమంతా కూడా సంస్కృతంలోనే ఉంది. వేదాలు ఉపనిషత్తులు భగవద్గీత అంతా కూడా సంస్కృతంలో ఉన్నాయి. గాంధీ గారికి సంస్కృతం రాదు. భగవద్గీత చదివి అర్థం చేసుకోవటానికి ఆయన సంస్కృతం నేర్చుకున్నారు.

ఇప్పుడు భగవాన్ వచ్చిన పని ఏమిటంటే, చైతన్యాన్ని, పరమార్థాన్ని పుస్తకాలలో వెదుకుతున్నారు. వేదాలలో ఉపనిషత్తులలో వెదుకుతున్నారు. అక్కడే ఉందని వస్తువు వెదుకుతున్నారు. ఈ నాటికి కూడా పాండిత్యమే జ్ఞానం అనుకొనే వాళ్ళు ఉన్నారు. పుస్తకాలలో జ్ఞానం లేదు, జ్ఞానం నీ హృదయములోనే ఉందని ప్రపంచాన్ని మలుపు తిప్పినవాడు భగవాన్. పుస్తకాలలో జ్ఞానం లేదు, జ్ఞానం నీ హృదయంలోనే ఉంది, నువ్వు అన్వేషణ చెయ్యవలసింది పుస్తకాలలో కాదు, నీ హృదయంలో అన్వేషణ చెయ్యాలి. నీ హృదయంలో ట్రూత్ ఉందని పుస్తకాలలో చెప్పారు కానీ, పుస్తకంలో ఉందని చెప్పలేదు. భగవద్గీతలో కృష్ణుడు మీ అందరి హృదయాలలో ఉన్నానని చెప్పాడు. అంతేకాని నేను పుస్తకంలో ఉన్నానని చెప్పలేదు. మనం ఏమి చేస్తున్నాము అంటే, సత్యాన్ని తీర్థయాత్రలలో గ్రంథాలలో అన్వేషణ చేస్తున్నాము. మీరు గ్రంథాలు చదివే కొలదీ పాండిత్యం వస్తుంది కానీ ట్రూత్ ని రియలైజ్ చేయలేరు.

జీసస్ ఏమీ పండితుడు కాదు. అయితే వాళ్ళు ఎలా ట్రూత్ ని రియలైజ్ చేశారు అంటే, ఔట్ ఆఫ్ ప్యూరిటి అండ్ సైలెన్స్. భగవాన్ జీవన్ముక్తుడే కాదు, అవతారపురుషుడు కూడా. వైష్ణవభక్తులు జీవన్ముక్తిని ఒప్పుకోరు. శరీరం ఉండగా ముక్తిని వైష్ణవ

సాంప్రదాయంలో డివోటీస్ అంగీకరించరు. శరీరం ఉండగా స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడో చూపటానికి, శరీరం ఉండగా కూడా ముక్తిని పొందవచ్చు అని మనకి చూపించటానికి భగవాన్ అవతారం వచ్చింది. అక్కడ లక్ష్యం అది. అంటే వేదాలలో, ఉపనిషత్‌లలో చెప్పినట్లుగా ఎవరో ఒకరు జీవించి చూపించక పోతే వేదాలకి అర్థం లేదు, ఉపనిషత్తులకి అర్థం లేదు, పురాణాలకి అర్థం లేదు. ఎవరో ఒకరు జీవించాలి, ఎవరో ఒకరు జీవించక పోతే అది అసత్యం అనిపిస్తుంది. అంటే ఉపనిషత్తులలో చెప్పింది, వేదాలలో చెప్పింది సత్యమే అని చెప్పటానికి ఎవడో ఒకడు అలా జీవించాలి. ఎవడో ఒకడు జీవించక పోతే, అది సత్యం అని ఎలా తెలుస్తుంది. అలా జీవించిన వాడు ఐడియల్ అవుతాడు.

ఉపనిషత్తులలో ఉన్న సారాన్ని భగవాన్ జీవించి చూపించారు. అంటే ట్రూత్ అలా మానిఫెస్ట్ అయ్యింది. ఆయన ప్రపంచాన్ని ఎక్కడ మలుపు తిప్పాడు అంటే, సత్యం గ్రంథాలలో లేదు, సత్యం అనేది మీ హృదయంలోనే ఉంది, దానికోసం మీ హృదయంలో అన్వేషణ చేయండి. మీరు అక్కడ వెతకండి మీకు దొరుకుతుంది. అది మీకు ఎరుకలోకి వస్తుంది. అయితే మీ బుద్ధికి కానీ, మీ ఇంద్రియాలకి కానీ, మీ మనస్సుకి కానీ అది ఆబ్జెక్ట్ కాదు. మీ లోపలఉన్న సత్యం దాని అంతట అది రివీల్ అవ్వాలి. అది మీకు ఎరుకలోకి వస్తే మీరు దానిని తెలుసుకోగలరు కానీ, దానంతట అది రివీల్ అవ్వకుండా తెలుసుకోలేరు. గీతలో ఏమని చెప్పారు అంటే బహుజన్మలలో నువ్వు సత్కర్మలు చెయ్యాలి. బహుజన్మలలో నువ్వు పుణ్యకార్యాలు చెయ్యాలి. సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. అలా చేస్తేనే ప్యూరిఫికేషన్ వస్తుంది, మైండు సెన్సెస్ (మనస్సు, ఇంద్రియాలు) ప్యూరిఫై అవుతాయి. ఆ రకంగా నీకు ముముక్షత్త్వం వస్తుంది. అప్పుడు భగవంతుడు నీకు ఎరుకలోకి వస్తాడని, ఇవన్నీ మన శాస్త్రాలలో చెప్పారు.

బహుజన్మల కృషి వల్ల కానీ జ్ఞానం రాదు అని ఒకరు గీతని కోట్ (quote) చేస్తూ భగవాన్ తో అన్నారు. అప్పుడు భగవాన్ అన్నారు, వాట్ డూ యు సే? నువ్వు ఏంటి చెపుతున్నావు. ట్రూత్ ఈజ్ హియర్ అండ్ నౌ. సత్యం ఇక్కడే ఉంది, ఇప్పుడూ ఉంది. నువ్వు రియలైజ్ చెయ్యాలి దానిని. బహుజన్మల కృషి చేస్తేనే కానీ రాదు అనుకోవటానికి, ట్రూత్ అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది, భవిష్యత్తులోనూ ఉంటుంది. అది లేని కాలం లేదు. నువ్వు ఇప్పుడే రియలైజ్ చెయ్యవచ్చు దానిని. బహుజన్మల కృషి అనేది ఎవల్యూషన్ లో జరిగేది, అది మామూలుగా అందరికీ ఉపయోగపడేలా జనరల్‌గా కృష్ణుడు చెప్పాడు కానీ,

దానిని నువ్వు రియలైజ్ చెయ్యగలిగితే అది ఇప్పుడే ఉంది, ఇక్కడే ఉంది. భగవాన్ రిపీటెడ్ గా అన్నారు వాట్ డూ యు సే, వాట్ డూ యు సే, అని ఆ ప్రశ్న వేసిన వాడితో. అంటే అది ఇప్పుడు లేదా ఇక్కడ లేదా, బహుజన్మల కృషి చేస్తేనే కానీ రాదు అనుకోవటానికి. నీకు బుద్ధి సూక్ష్మత వచ్చినప్పుడు, మనస్సు అంతర్ముఖం అయినప్పుడు ఇప్పడే ఇక్కడే నీకు ఎరుకలోకి వస్తుంది. సూక్ష్మబుద్ధి ఉంటేనే కానీ సూక్ష్మ విషయాలు గ్రహించలేము. స్థూల బుద్ధికి సూక్ష్మ విషయాలు తెలియబడవు.

భగవాన్ ఇక్కడికి వచ్చిన అవతార ప్రయోజనం ఏమిటంటే, మీరు కేవలం గ్రంధాలలో చైతన్యాన్ని వెదుకుతున్నారు. కాని అది మీ హృదయంలోనే ఉంది. దానిని ఇప్పుడే ఇక్కడే మీరు గ్రహించవచ్చు. మీ శరీరం చనిపోయేవరకూ మీరు దానికోసం వెయిట్ చెయ్యక్కరలేదు. ఇక్కడే ఇప్పుడే మీరు దానిని పొందవచ్చు. ఈ సృష్టి దానంతట అది ఉందా, ఎవరైనా దీనిని సృష్టించారా, ఎందుకు ఆ పేచీలు మీకు? ఇదొక వివాదం. భగవాన్ ఏమన్నారు అంటే, మీ శరీరం పుట్టకముందు సృష్టి ఉంది. మీ శరీరం చనిపోయాక సృష్టి ఉంటుంది. దాని గురించి మీరు పేచీలు పడతారు ఎందుకు? మీ శరీరాలు రాకముందు ఈ లోకం ఉంది, మీ శరీరాలు పోయిన తరువాత ఈ లోకం ఉంటుంది. అలాగే మీరు ఇక్కడికి వచ్చారు కాబట్టి మీకు ఫ్రీడం కావాలి, ఆనందం కావాలి. మీరు పొందవలసింది ఏదో పొంది బయటికి వెళ్లిపోండి. ఈ సృష్టి సత్యమా అసత్యమా, ఇది నిత్యమా అనిత్యమా ఈ రకమైన పేచీలు మీకు అనవసరం. ఈ ప్లానేట్ లోకి వచ్చారు, భగవంతుడు మీకు ఒక శరీరం ఇచ్చాడు, ఒక అవకాశం ఇచ్చాడు మీరు ట్రూత్ ని రియలైజ్ చేయటానికి. మీరు ట్రూత్ ని రియలైజ్ చెయ్యలేకపోతే మీకు శాంతి లేదు, ఆనందం లేదు.

రమణమహర్షిగారు జ్ఞానగురువు. ఆ కొండ శాంతిగురువు. అది శాంతి మలై, నాట్ అన్నామలై. అది శాంతిని ఇచ్చే కొండ. అన్నామలై అంటే అందని కొండ అని. అంటే బ్రహ్మదేవుడికి విష్ణుదేవుడికి అందలేదు కాబట్టి అన్నామలై అన్నారు. శాంతి మలై, అది మనకి శాంతిని ఇచ్చే కొండ. మీ ఇంటికాడ మీరు కూర్చుని, దానిని స్మరిస్తే మీకు శాంతి దొరుకుతుంది. అరుణాచలంలో అన్నిటికంటే మౌంటెనే ముఖ్యం. టెంపుల్ కూడా సెకండరీ. టాప్ మోస్ట్ ఇంపార్టెన్స్ షుడ్ బి గివెన్ టు ది మౌంటెన్ ఓన్లీ. ఆ మౌంటెన్ మనకి శాంతిని ప్రసాదిస్తుంది, శాంతి మలై. భగవాన్ మనకి జ్ఞానం ప్రసాదిస్తారు. భగవాన్ జ్ఞానగురువు. ఒకసారి మనం ఆయన దృష్టిలో పడితే, ఆయన గ్రేస్ లో కనుక మనం

పడితే, ఆ గేటు ద్వారానే జ్ఞానం పొందాలి కానీ ఇంకో అవకాశం లేదు. ఒకసారి ఆయన ఫోల్డ్ లోకి మనం వెళ్తే మనకి ఎస్కేప్ అవ్వటానికి అవకాశం లేదు. పది రోజులు వెనకో ముందో ఆ గేటు ద్వారానే మనం మోక్షాన్ని పొందాలి. భగవాన్ కరుణామయుడు. జ్ఞానులు అందరూ కరుణామయులే. అయితే భగవాన్ టీచింగ్ ఎక్కువ ఇంకా స్ప్రెడ్ అవ్వలేదు. ఆ లిటరేచర్ కి కూడా తగిన ప్రాముఖ్యత రాలేదు. రామకృష్ణమిషన్‌లో, రామకృష్ణుడి మెసేజ్ అంతా స్ప్రెడ్ అయ్యింది అంటే లిటరేచర్ వల్లే. మనకి లిటరేచర్ మెయిన్ ఇన్‌స్ట్రుమెంట్. రామకృష్ణ మిషన్ వాళ్ళు చూడండి, బుక్‌స్టాల్స్ అన్ని చోట్లా పెట్టేస్తారు. ఆ బుక్‌స్టాల్స్ ద్వారా లిటరేచర్ స్ప్రెడ్ చెయ్యటం వల్ల రామకృష్ణుడి మెసేజ్ బాగా స్ప్రెడ్ అయ్యింది. అయితే రామకృష్ణుడు భక్తి గురించి ఎక్కువ చెప్పినా, గోల్ అద్వైతమే. రామకృష్ణ మిషన్ వాళ్ళ గోల్, డెస్టినేషన్ అద్వైతం.

భగవాన్ ఏమి చెప్పారు అంటే, మార్గము నువ్వే గమ్యము నువ్వే. లోపల ఆయననే మనం సాధనగా తీసుకోవచ్చు, గమ్యం కూడా ఆయనే. భగవాన్ దగ్గరికి వచ్చేసరికి, మనకి మీన్స్ ఆయనే, గోల్ కూడా ఆయనే. మీరు మీ చేతిని టచ్ చేసుకుంటే, ఆ టచ్ ఎలా తెలుస్తుందో, ఆయన గ్రేస్ కూడా అలాగే తెలుస్తుంది. కానీ మిమ్మల్ని అభిమానిస్తున్నట్టు, మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టు ఆయన బయటికి ఏమీ కనపడడు. మీలో ఏమైనా సీక్రెట్ బర్డెన్స్ ఉంటే, మీలో రియలైజేషన్ కి హర్డెల్స్ (అడ్డంకులు) ఏమైనా ఉంటే, వాటిని తీసేస్తాడు. మీలో ఉన్న ఆటంకాలు ఆయనకి తెలుసు. మీకు అంతర్యామిగా ఉన్నవాడు ఆయనే. ట్రూత్‌ని రియలైజ్ చేయటానికి ఏ ఆటంకాలు అయితే మీకు వస్తున్నాయో, ఆ ఆటంకాలు మీకు తెలియకుండా సర్జరీ చేసి తీసేస్తాడు. ఎంత బరువైన రాళ్ళు అయినా సరే తీసేస్తాడు. అంటే భగవంతుడికి అన్నీ సాధ్యమే. గురువుకి అన్నీ సాధ్యమే. జీవుడికి అన్నీ సాధ్యం కాకపోవచ్చు, కానీ భగవంతుడికి అన్నీ సాధ్యమే.

భగవాన్ జ్ఞానమార్గానికి డైరెక్ట్ పాత్ ఓపెన్ చేసి ఈ ప్రపంచాన్ని, ఈ క్రియేషన్ అంతా కూడాఒక మలుపు తిప్పేసాడు. వాడు ఆస్తికుడా నాస్తికుడా ఆయనకి అక్కరలేదు. నువ్వు ఉన్నావా లేదా? ఆ నేనుని బేస్ చేసి, నువ్వు ఎక్కడికి వెళ్ళినా, సబ్జెక్టు ని ఎక్కడనుంచి ప్రారంభించినా ఈ నేను దగ్గరికే తీసుకొస్తూ ఉంటాడు. బాడీ బౌండ్ ఐ దగ్గరికి తీసుకొస్తాడు. ఎందుకంటే ఈ నేను సోర్స్ తెలియకుండా మీకు ట్రూత్ తెలియదు. గణపతిశాస్త్రిగారు ఒకసారి అడిగారు. మీరు చదువుకున్న వాళ్ళు వచ్చినా నేను గురించే చెపుతున్నారు, చదువు

లేని వాళ్ళు వచ్చినా ఈ నేను గురించే చెపుతున్నారు, ఆ నేను గొడవ వదిలేయండి అని. ఏదో కొంచెం పురాణంలో మాటలు, రామాయణంలో ఇలా ఉంది, భారతంలో ఇలా ఉంది, భాగవతంలో ఇలా చెప్పాడు వ్యాసుడు అని చెప్పి వాళ్ళని కొంచెం ఎడ్యుకేట్ చెయ్యాలి కదా. అందరికీ నేను నేను అని చెపితే, ఆ నేను వాళ్ళు అందుకోగలరా అని శాస్త్రి గారు భగవాన్ని అడిగారు. అసలు భగవాన్ లో ఉన్న స్పిరిట్ మురుగునార్ అందుకున్నట్టు గణపతిశాస్త్రిగారు అందుకోలేదు. గణపతిశాస్త్రి ఈజ్ ఎ గ్రేట్ పేట్రియాట్ అండ్ ఎ స్కాలర్ ఆల్సో, సంస్కృతంలో స్కాలర్. అయితే భగవాన్ హృదయాన్ని పట్టుకున్న వాడు, ఎక్కువగా భగవాన్ కి క్లోజ్‌గా ఉండి, ఏ సెంటెన్సుకి ఆ సెంటెన్స్ తీసుకొని, దానిమీద మెడిటేట్ చేసి, దాన్ని డైజెస్ట్ చేసుకున్నవాడు మురుగునారు. గణపతిశాస్త్రిగారు ఏ స్కాలర్ అండ్ ఏ పేట్రియాట్. అంటే ప్రత్యేకంగా ట్రూత్ రియలైజేషన్ కి ఆయన జీవితాన్ని డెడికేట్ చేయలేదు. అయితే భగవాన్‌కి పేరు పెట్టింది ఆయన, రమణాశ్రమానికి పేరు పెట్టింది ఆయన, రమణగీత రాసింది ఆయన. ఇండియాలో ఎక్కువగా భగవాన్ పేరు వ్యాప్తి చేసింది గణపతిముని. అందుచేత భగవానుని గుర్తు చేసుకున్నప్పుడు, ఆయనతో పాటు గణపతిమునిని కూడా గుర్తు చేసుకోవాలి.

"హూ యామ్ ఐ"నేను ఎవడను అనే ప్రశ్న ఇక్కడే వచ్చింది. ట్రూత్ గురించి శాస్త్రిగారి దగ్గరే మొదట భగవాన్ చెప్పారు. నేను నేను అనే తలంపు ఎక్కడ పుడుతోందో చూడు, అది బయటినుంచి రావటం లేదు కదా, దాని సోర్స్ నీ హృదయంలోనే ఉంది. ఈ నేను అనే తలంపు నీకు ఎక్కడినుంచి వస్తోంది, నీ హృదయంలోంచే వస్తోంది. ఆ ప్లేసుని నువ్వు చూడగలిగితే, ఎక్కడైతే నేను అనే తలంపు బర్త్ తీసుకొంటోందో, ఆ ప్లేసుని నువ్వు చూడగలిగితే నీ మనస్సు వెళ్ళి అక్కడ అణిగిపోయి అది నశిస్తుంది. తపస్సుకి నిర్వచనం భగవాన్ ఇలా చెప్పారు శాస్త్రిగారికి. అంటే నాస్తికుడు కూడా నేను లేను అని ఎవడూ అనడు. అందరూ నేనుని అంగీకరిస్తారు.

రామకృష్ణుడు జ్ఞానానికి నిర్వచనం చాలా సింపుల్‌గా చెప్పాడు. బంకిమ్ చంద్ర చటర్జి జ్ఞానం అంటే ఏమిటి అని రామకృష్ణుడిని అడిగాడు. రామకృష్ణుడు ఒకే వాక్యంలో సమాధానం చెప్పాడు - మనం అందరం నేను, నేను అంటున్నాము కదా, అందరూ నేనుని ఉపయోగిస్తారు. ఈ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం. ఊరికే ఒన్ సెంటెన్స్. He expressed truth in one sentence. నేను నేను అని నువ్వు అంటున్నావు. నువ్వు చెప్పే ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం. దట్ ఈజ్ ఆబ్సల్యూట్ నాలెడ్జ్. ఒక్క

వాక్యంలోనే చెప్పాడు రామకృష్ణుడు. ఈ మధ్య కాలంలో మనకి వచ్చిన జీవన్ముక్తులు ఒకడు రామకృష్ణుడు, రెండు భగవాన్. వేదాలలో ఉపనిషత్తులలో చెప్పిన ఋషి యొక్క సాంప్రదాయాన్ని రమణమహర్షి వచ్చి నిలబెట్టాడు. అసలు టీచింగునే మలుపు తిప్పాడు ప్రపంచంలో. ఆయన వచ్చేసరికి లోకం ఎలా ఉంది అంటే, అందరూ గ్రంథాలు చదువుతున్నారు. గ్రంథాలు చదివి చర్చలు. ఈ చర్చల వల్ల, ఆర్గ్యుమెంట్స్ వల్ల ఈగో సెన్స్ పెరిగిపోతుంది. తర్కాల వల్ల ఈగో సెన్స్ ఫీడ్ అవుతుంది అని భగవాన్ చెప్పారు.

భగవాన్ వచ్చిన ప్రయోజనం ఏమిటంటే, ప్రపంచాన్ని అంతా ఆయన ఎక్కడ మలుపు తిప్పాడు అంటే, మీరు అందరూ జ్ఞానం కోసం, సత్యం కోసం, సుఖం కోసం, శాంతి కోసం గ్రంథాలలో వెతుకుచున్నారు కానీ అది మీ హృదయంలోనే ఉంది. ప్రపంచంలో ఎక్కడా ఆనందం లేదు. అది మీ హృదయంలోనే ఉంది. మీ స్పిరిచ్యువల్ హార్ట్‌లో అన్‌లిమిటెడ్‌గా ఉంది. సముద్రంలో ఎంత నీరు ఉందో, మీ హృదయంలో కూడా అంత ఆనందం ఉంది. అది మీకు రివీల్ అవుతుంది. భగవద్గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు, అంతటా నీరు ఉన్నప్పుడు నీటికోసం నూతుల దగ్గరికి, చెరువుల దగ్గరికీ వెళ్ళటం ఎందుకు? నీ హృదయంలో ఉన్న ఆనందం బ్రెయినుకి సప్లయ్ అవుతూ ఉంటే, నువ్వు ప్రపంచంలో ఆనందం కోసం, శాంతి కోసం వెదకవలసిన పని ఏమిటి? అని ఆయన చెప్పటమే కాదు, నీ మనస్సుని అంతర్ముఖం చేస్తాడు. అది కూడా భగవాన్ చేసే పనే. నీ మనస్సుని అంతర్ముఖం చేస్తాడు. ఆయన ప్రెజెన్స్ లో నీకు మైండ్ ఇంట్రావర్ట్ అవుతుంది. అయితే ఒకటి, భగవాన్ శరీరం ఉన్నప్పుడు కంటే, భగవాన్ శరీరం విడిచిపెట్టిన తరువాత డివోటీస్ పెరిగారు. ఎందుచేతంటే, భగవాన్ అంటే ఆ శరీరం కాదు. ఏదైతే మనం భగవాన్ అనుకొంటున్నామో దానికి డెత్ లేదు. అందుచేత ఆయన యొక్క గ్రేస్ అలా పని చేస్తోంది, భక్తులు అలా పెరుగుతూనే ఉన్నారు.

నా సంగతి చెపుతున్నాను (నాన్నగారు). "హౌ భగవాన్ కేమ్ ఇంటు మై లైఫ్", భగవాన్ నా జీవితంలోకి ఎలా వచ్చారు, అని రాశాను. గణేశన్ గారు దానిని మౌంటెన్ పాత్ అనే పత్రికలో ప్రింట్ చేశారు. నేను భగవాన్ సాహిత్యం చదవలేదు. రమణమహర్షి అనే వ్యక్తి ఇండియా లో పుట్టి పెరిగారు, ఆయన ఇండియా లో ఒక సెయింట్ అని కూడా నాకు తెలియదు. 1957 లో ఆయన నాకు డ్రీమ్ లోకి వచ్చి బ్లెస్స్ చేశారు. బ్లెస్స్ చేస్తే, నేను ఏక్సెప్ట్ చేయలేదు. నన్ను వదిలేయి నన్ను వదిలేయి అంటున్నాను. కానీ మొత్తం మీద వదలలేదు. ఫర్ ది టైమ్ బీయింగ్ ఇట్ ఈజ్ ఎనఫ్. ప్రస్తుతానికి ఇది సరిపోతుంది

అన్నారు కానీ మొత్తానికి వదలలేదు. అయితే నేను 1959 జనవరి లో అరుణాచలం వెళ్ళాను. ఆశ్చర్యం ఏమిటంటే, నేను విరూపాక్ష గుహలోకి వెళ్లి కూర్చున్నాను. ఇది పూర్వం పరిచయం ఉందే మనకి, ఇదివరకు ఈ విరూపాక్ష గుహ చూశాను. నాకు అది పాత ప్లేస్ కిందే కానీ కొత్త ప్లేస్ కింద కనపడలేదు. అంటే విరూపాక్ష గుహలో ఉండగా భగవానుకి నాకు ఏదో అనుబంధం ఉన్నట్టు అనిపించింది. అది కొత్త ప్లేస్ కింద కాదు నాకు పాత ప్లేస్ కిందే ఉంది. విరూపాక్ష గుహతో ఏదో అటాచ్మెంట్ ఉంది నాకు ప్రీవీయస్ బర్తులో అని ఆ గుహ చూసినప్పుడు నాకు అనిపించింది.

మీకు రియలైజేషనుకి, ట్రూత్ ని రియలైజ్ చేయటానికి, మీకు ఏమైనా మైనస్ పాయింట్స్ ఉన్నప్పటికీ, ఆయన స్లోగా రిమూవ్ చేస్తాడు. స్లోగా ఎలిమినేట్ చేస్తాడు. నీ పక్కన కూర్చున్న వాడికి కూడా ఆయన చేసేది తెలియదు. రామకృష్ణుడి ప్రేమ మాటలలో వ్యక్తమవుతుంది. భగవాన్ సైలెంట్, మీకు ఆయన ద్వారా సహాయం అందుతున్నట్టు పక్కవాడికి కూడా తెలియనివ్వడు. సైలెంటుగా వర్క్ చేస్తాడు, ఆ ట్రూత్ సైలెంటుగా వర్క్ చేస్తుంది. గొప్ప వైరాగ్య పురుషుడు. రమణాస్ డిటాచ్మెంట్ ఈజ్ ఏజ్ కంప్లీట్ ఏజ్ ఇట్ ఈజ్ పర్ఫెక్ట్. అంత వైరాగ్య పురుషుడు. భగవాన్ చెప్పారు, నీకు వైరాగ్యం ఉంటే జ్ఞానం వచ్చేస్తుంది అని. దే ఆర్ నాట్ డిఫరెంట్. అసలు నీకు వైరాగ్యం ఉంటే జ్ఞానం వచ్చేస్తుంది. అటాచ్మెంట్ వల్ల వేవరింగ్ వస్తుంది, డిటాచ్మెంట్ వల్ల వెవరింగ్ ఏమీ రాదు. అందుచేత నువ్వు ఇంటికాడ వర్క్ చేసుకున్నా, డిటాచెడ్ అటాచ్మెంట్ అవసరం. వర్క్ చేస్తున్నా డిటాచెడ్‌గా ఉండాలి. అది జ్ఞానమార్గం ప్రసాదిస్తుంది.

ఇంతకీ భగవాన్ ఈ లోకంలోకి ఎందుకు వచ్చాడు? ప్రపంచం రాంగ్ డైరక్షన్‌లో వెళుతోంది. అంటే మూఢనమ్మకాలు, ఈ ఆచారాల పేరు మీద మనిషికి హింస పెరుగుతోంది. సమాజంలో వయిలెన్స్ కూడా పెరుగుతోంది. డోమెస్టిక్ వయిలెన్స్ కూడా ఉంది. జ్ఞాన సముపార్జనకి గొర్రెలని మేకలని చంపక్కరలేదు. రిచువల్స్ వల్లే కేవలం మీకు జ్ఞానం వచ్చేయదు. రిచ్యువల్స్ మీకు ఇష్టం ఉంటే చేసుకోవచ్చు, ఊరికే మైండ్ కంట్రోలుకి ఉపయోగపడుతుంది. నువ్వు ఎక్కడైతే వెదుకుతున్నావో, దేవాలయాలలో, యాత్రలలో ఎక్కడైతే వెదుకుతున్నావో, జ్ఞానం అక్కడ లేదు. నువ్వు సత్యం కోసం ఎక్కడైతే వెదుకుతున్నావో అక్కడ లేదు. జ్ఞానం నీ హృదయంలోనే ఉంది. పాండిత్యం సంపాదిస్తే నీకు జ్ఞానం వచ్చేయదు. పాండిత్యంలో జ్ఞానం లేదు. డబ్బు ఎటువంటిదో, పాండిత్యం కూడా అటువంటిది. నువ్వు

పాండిత్యం జ్ఞానం అనుకొంటున్నావు. పుస్తకాలు చదివితే నీకు పాండిత్యం వస్తుంది కానీ జ్ఞానం రాదు. జ్ఞానం అనేది నీ హృదయంలో ఉంది, అక్కడ అన్వేషించు. అక్కడ నువ్వు తట్టు నీకు తెలియబడుతుంది, అక్కడ వెదకండి మీకు తెలియబడుతుంది అని ప్రపంచాన్ని హృదయం వైపుకి తిప్పి, భక్తులు అందరినీ హృదయం వైపుకి తిప్పటానికి ఆయన అవతారం ఇక్కడికి వచ్చింది. పండితులూ, భక్తులు కూడా జ్ఞానం కోసం గ్రంథాలలో వెదుకుతున్నారు. గ్రంథాలలో కాదు, నీ హృదయంలో వెదకాలి, అది నీ హృదయంలోనే ఉంది, అని ప్రపంచాన్ని ఇటు మలుపు తిప్పటానికి, ఇన్నర్ సైడ్ మీకు చూపించటం కోసం భగవాన్ వచ్చారు. ఆనందం నీ హృదయంలోనే ఉంది, నీకు మరొక పేరే, ఆనందం. అది బయట ఎక్కడా లేదు, నీ హృదయం లోనే ఉంది అని నీకు నిరూపించటానికి ఆ ఆనందమే రూపం ధరించి వచ్చింది. ఊరికే ఆ రూపాన్ని మీరు ధ్యానం చేసినా, ఆ నామాన్ని మీరు స్మరించినా, సరిపోతుంది. మైండ్ కంట్రోల్ వస్తుంది, సెన్స్ కంట్రోల్ వస్తుంది, పీస్ కూడా వస్తుంది.

భగవాన్ చెప్పింది ఏమిటి అంటే సత్యం కోసం మీరు వరల్డ్‌లో వెదకటం కాదు, పుస్తకాలలో వెదకటం కాదు, పాండిత్యం వల్ల మీకు జ్ఞానం రాదు. సద్వస్తువు మీ హృదయంలో ఉంది, మీ హృదయంలో అన్వేషించండి అని. బాహ్యాముఖము అవుతున్నటువంటి మీ మనస్సుని అంతర్ముఖము చేసి, మిమ్మల్ని అందరినీ ట్రూత్ సీకర్స్ గా (సత్యాన్వేషకులుగా) తయారు చేయటానికి, ట్రూత్ ఎక్కడ ఉంది అని చెప్పటానికి ఆయన అవతారం వచ్చింది. ప్రపంచాన్ని ఒక మలుపు తిప్పాడు ఆయన. అది మనం గ్రహించాలి.

ఈ రోజు ఈ నాలుగు మాటలు ఎందుకు చెపుతున్నాను అంటే, అసలు రమణావతారం ఎందుకు వచ్చింది ఈ భూమి మీదకి. దీని ప్రయోజనం ఏమిటి. వేదంలో నాలుగు మాటలు చెప్పటానికి కాదు ఆయన వచ్చింది. లివింగ్ ట్రూత్ ఆయన. అటువంటి వాళ్ళు కొంతమంది ట్రూత్ ని జీవించి చూపించారు కాబట్టే వేదాలకి గౌరవం ఉంది కానీ, లేకపోతే వేదాలకి గౌరవం లేదు. రామకృష్ణుడో రమణుడో ఎవరో ఒకరు జీవించి చూపిస్తున్నారు కానీ, అలా ఎవరో ఒకరు జీవించి చూపించక పోతే వేదాలని ఎవరూ నమ్మరు. వేదాలకి గౌరవం పోయి ఉండేది ఈ పాటికి.

అయితే మనందరికీ ఆయన అనుగ్రహం ఉంది. మనందరి శిరస్సుల మీద ఆయన అనుగ్రహం ఉంది. ఆ అనుగ్రహం మనకి హ్యూమన్ టచ్‌లా తెలుస్తూ ఉంటుంది. రియలైజేషన్ కోసం మన ఎఫర్ట్ కొద్దిపాటి ఉన్నా, మన ఎఫర్టే గ్రేస్ కింద మారిపోతుంది


అని చెప్పారు భగవాన్. ఆయనని ప్రేమించటానికి కూడా ఆయన గ్రేస్ ఉండాలి. భగవాన్ని మనం ప్రేమించటానికి కూడా, భగవాన్ మనకి రిమెంబరెన్స్ లోకి రావటానికి కూడా ఆయన అనుగ్రహం ఉండాలి. ఆయన గ్రేస్ లేకపోతే ఆయన రిమెంబరెన్స్ కూడా రాదు మనకి. భగవాన్‌తో ఎవరైనా మీరు మమ్మల్ని మరిచిపోయారా అంటే, నేను మీకు జ్ఞాపకం వచ్చాను అంటే నా గ్రేస్ వల్లే కదా మీకు జ్ఞాపకం వచ్చాను అనేవారు. అందుచేత మనని ఏ శక్తి అయితే ఏ ఎనర్జి అయితే భగవాన్ ఫోల్డ్ లోకి తీసుకెళ్ళిందో, ఆ శక్తే మనకి ట్రూత్ రియలైజేషన్‌ని కూడా ప్రసాదిస్తుంది. ట్రూత్ రియలైజ్ చేసేలా మనల్ని చేస్తుంది, తరువాత ఆనందం వస్తుంది. భగవాన్ని సదా జ్ఞాపకం పెట్టుకోవటం వల్ల హద్దులు లేని శాంతి హద్దులు లేని ఆనందం వస్తాయి.

ఈ మాటలు నేను (నాన్నగారు) సబ్జెక్ట్ చెప్పటానికి చెప్పటం లేదు. అసలు భగవాన్ అవతారం ఈ భూమి మీదకి ఎందుకు వచ్చింది, అది అర్థం చేసుకోవాలి మీరు. అది మెయిన్. భగవాన్ కి ఆర్గనైజేషన్ ఏమీ లేదు. ఆయన మాటలో ఉన్న శక్తే స్ప్రెడ్ అవుతోంది. అందుకని ప్రత్యేకంగా రామకృష్ణ మిషన్ లాగా ఆర్గనైజేషన్ ఏమీ లేదు. ఏదో ఈ మధ్యన గణేశన్ గారు కొన్ని దేశాలు వెళ్ళి, ఆయన చెప్పగలిగింది ఏదో భగవాన్ గురించి చెపుతున్నారు. ఆ రకంగా భగవాన్ చేతిలో ఆయన ఇన్‌స్ట్రుమెంట్. భగవాన్ తన ఇన్‌స్ట్రుమెంట్‌గా గణేశన్ గారిని ఉపయోగించుకొంటున్నారు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహత్మ్యం అక్షరమణమాల

**ఈ నింద తప్పు, నిన్నేటికి తలపించి**

**తిక విడువారెవ రరుణాచలా!**

**తాత్పర్యం:** ఏమీ తెలియని నా చేత నిన్ను స్మరింపచేసావే, ఇలా ఎందుకు చేసావు? ఇది నీ తప్పు కాదా? ఈ నిందను నీకు రానీయకు అరుణాచలా! ఒక్కసారి నీ సుఖ స్వరూపాన్ని రుచి చూసాక, నీవు కాదన్నా నిన్ను ఎవరు విడిచిపెట్టగలరు అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా! నిన్ను ఏటికి తలపించితివి? ఈ నింద నుండి తప్పుకోవయ్యా! అసలు నిన్ను స్మరించేటట్టు నన్నెందుకు చేశావయ్యా? ఇక విడువారెవరు అరుణాచలా? నీ మైకంలో పెట్టేసావు అరుణాచలా, నీ మాయలో నన్ను పెట్టేసావు అరుణాచలా. నీ మత్తులో నన్ను పెట్టేసావు అరుణాచలా. నీ మోహంలో పడ్డాను అరుణాచలా. నీ గొడవలో పడ్డాను అరుణాచలా. నీ వలలో పడ్డాను అరుణాచలా. ఇంక నిన్నెవరు విడిచిపెడతారు అరుణాచలా! ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు పొమ్మంటే మట్టుకు ఎవడు పోతాడు అరుణాచలా. ఒక్కసారి ఆ రుచి చూసాక ఒకవేళ నువ్వు పోమ్మంటావు అనుకో, పొమ్మంటే మట్టుకు ఎవడు పోతాడు.

ఓ అరుణాచలేశ్వరుడా నీ రుచిని చూపించావు. ఆత్మ రుచి ఎలా ఉంటుందో చూపించావు. ఆత్మ వైభవం ఎలా ఉంటుందో, ఏ శాంతిని పొందాక, ఏ సుఖాన్ని పొందాక, ఏ స్థానాన్ని పొందాక, దానికి మించిన సుఖం కాని, దానికి మించిన శాంతి కాని లేదో, అటువంటి శాంతిని పొందింప చేసావు అరుణాచలేశ్వరుడా. దానికి పోల్చదగిన శాంతి ఈ లోకంలో లేనేలేదు, పరలోకంలోనూ లేదు. ఇంద్రియాలు అక్కడికి వెళ్ళలేవు, మనస్సు అక్కడికి వెళ్ళలేదు, బుద్ధి అక్కడికి వెళ్ళలేదు. వెళ్లాలన్నా వెళ్ళలేవు, మళ్ళీ తిరిగి వెనక్కి వచ్చేయవలసిందే. అటువంటి శాంతిని నువ్వు నాకు రుచి చూపించావు అరుణాచలా. ఇప్పుడింక ఎక్కడికి పోతాను అనుకొంటున్నావు? ఎక్కడికీ వెళ్ళను అరుణాచలా. నిన్ను విడిచిపెట్టి వెళ్ళటానికి నాకు స్థానం ఏముంది అరుణాచలా! మరి నీ వైభవం బయట ఉందా అరుణాచలా? ఒక్కసారి ఆత్మని రుచి చూసిన వాడికి తెలుస్తుంది ప్రకృతిలో ఏమీ లేదు అంతా ఒట్టి గడ్డి అని!

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **520101264185724**
**UNION BANK OF INDIA, PALAKOL BRANCH**
IFSC Code : **UBIN0916137, Contact No. 9866715896**

# కాల గమనం

అనేక ఆటుపోట్లు, ఇబ్బందులు, సమస్యలు అధిగమించి 2020 సంవత్సరానికి వీడ్కోలు పలికి, 2021 నూతన ఆంగ్ల సంవత్సరంలోనికి ప్రవేశించాం! క్రొత్త ఆశయాలతో, ఆశలతో, నూతన సంవత్సరం రానే వచ్చింది! కాలగమనములో మార్పు అనేది అనివార్యము మరియు ప్రకృతి సహజము. చెట్టు నుండి రాలే ప్రతి ఆకు మార్పు అనివార్యమని మనకు గుర్తుచేస్తుంది. కానీ మార్పుకు ఆధారమైన సత్యము మారదు. అట్టి సత్యము మన స్వరూపమే! కాలము పరమాత్మ స్వరూపమే! ఈ మానవ శరీరము వాస్తవముగా తాను ఎవరో? తెలుసుకొనుటకు ఒక కాలములో పరమాత్మచేత ప్రసాదింపబడినది కాబట్టి, మరొక కాలములో తీసుకోబడుతుంది. కాబట్టి సత్యప్రాప్తికై దానిని ఉపయోగించుట వలననే, సార్థకత చేకూరుతుంది. దేహము జీవించి యుండగానే, దేహాత్మ బుద్ధి నుండి విడుదల పొందుటయే మన గమ్యము కాబట్టి, కాల రూపములో ఉన్న ఈ మానవజన్మను వృధా చేసుకోకూడదు. బంగారంలోని ప్రతీ కణానికి విలువ ఉన్నట్లే, మానవజీవితంలో ప్రతిక్షణానికి ఎంతో విలువ ఉంది. ఏ మార్గాన్ని అవలంబించినా అద్వైతానుభవం పొందాలి. కాలాతీతమైన కేవల చైతన్యమే సర్వుల స్వరూపం. జీవించవలసిన ఈ వర్తమాన కాలములో, అహంకారంతో అనగా దేహాత్మబుద్ధితో జీవించడమే నిజమైన నష్టం. కాబట్టి అహంకారంచేత జీవితం నడపబడకూడదు, జ్ఞానముచేత జీవితం నడపబడుతూ, ఆశీర్వదింపబడాలి. నన్ను నా నుండి దూరం చేసే పరమశత్రువు అహంకారం. ఒక కాలములో పుట్టి, మరొక కాలములో నశించే దేహము, నేను కాదు; అమృత స్వరూపుడినే నేను! రోగం ఉన్నంతకాలము దేహానికి బాధ ఎలాగైతే ఉంటుందో, అజ్ఞానం ఉన్నంతకాలము మనస్సుకి దుఃఖము తప్పదు. ప్రతి క్షణము వృధా కాకుండా, స్వస్వరూపానుభూతిని పొందడానికి వినియోగించాలి. వృధాగా గడిపిన కాలము దుమ్ముతో సమానము. కాల రూపంలో ఉన్న ఈ మానవ జీవితాన్ని పరమాత్మ కొరకు వినియోగిస్తున్నామా? దేహము కొరకు వినియోగిస్తున్నామా? అనేది విచారించాలి. స్వస్థితిలోకి మేలుకోవాలి.

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురువు పాదాభివందనంతో మనలోని అయోమయం అంతా అంతర్ధానమౌతుంది

సద్గురువు పాదాభివందనం అంటే పురుషుడు అతనిలో ఎనిమిది అంగాలను తలనుండి కాళ్ళ వరకు కర్రపడిపోయినట్లు పాదాలను తాకాలి. స్త్రీ మోకాళ్ళపై వంగి పాదాభివందనం చేస్తే అరిషడ్ వర్గాలు అంతరించిపోతాయి. స్వప్రయత్నంలో ఆ వర్గాలను అంతం చెయ్యటం అంటే సూర్యుని దగ్గరకు వెళ్ళటంలాంటిది. కొందరు సాధకులు గత జన్మలో కర్మలు చాలా వరకు హరించుకొన్న జె.కె. లాంటి వారు బహుకొద్దిమంది ఉండవచ్చు. “గురుగీత” గురుకృప గురించి విపులంగా ప్రస్థావించింది. శరీరాన్ని ధరించిన అందరూ ప్రారబ్దాన్ని అనుభవించవలసిందే. జ్ఞాని దుఃఖాలను సంతోషంగా అనుభవిస్తే అజ్ఞాని ఏడుస్తూ అనుభవిస్తాడు. చేసిన కర్మ ఎప్పుడు నిష్ఫలం కాదు. సప్త సముద్రాలు అడ్డుగా ఉన్నప్పటికీ సమయం వచ్చినప్పుడు ఆ ఫలం అంది తీరుతుంది. కానీ సద్గురు 20 సం॥లు కర్మల భారాన్ని ఒక గంట స్వప్నంలో అనుభవింపజేసి శిష్యుణ్ణి ముందుకు తీసుకొనిపోతాడు. సాధకుడు ఇతరులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా చల్లగా మాట్లాడాలి. ఒకమాట అమృతంగా ఉంటుంది, మరోమాట గాయం చేసేలా ఉంటుంది. ఎవరు నాలికను వశంలో ఉంచుకుంటారో వారికి ప్రపంచం వశమౌతుంది. లేకపోతే అవలక్షణాలు ఉత్పన్నమౌతాయి. సాధకునకు వాక్కు తపస్సు కావాలి. శ్రీనాన్నగారు ఆత్మ ప్రేమ రసాన్ని కడుపారా త్రాగారు కాని ఆ అమృతాన్ని త్రాగటానికి కొద్దిమందే వస్తుంటారు. సద్గురువు వాక్యాన్ని గుర్తించకపోతే ఏ ప్రమాణాన్ని చూపలేరు. ఒక చిన్నారి పాప తల్లితో అమ్మా అమ్మా నేను నీకు ఎలా పుట్టాను అంటే తల్లికి అంతా తెలుసు పిల్ల అర్థం చేసుకోలేదని నిన్ను ఒక బైరాగి వాని దగ్గర ఒక రూపాయికి కొన్నాను అనగా పిల్ల అలాగా అంటుంది. ఆత్మ వైభవాన్ని ఎవ్వరూ చెప్పలేరు. మూగవాడికి మిఠాయి యిచ్చి ఎలా ఉంది అంటే ఏం చెప్పగలడు? మనం మూగవాళ్ళము కాని వాక్కు దాన్ని సూచిస్తుంది అంటారు పెద్దలు. గురునామాన్ని విడిచిపెట్టకూడదు. సహజంగా జరిగేది జరగనీయి. భగవంతుడు సహజంగానే అనుభూతికి అందుతాడు మన కర్మల భారం పూర్తి అయినప్పుడు అంటారు గురువులు. ఓ చిత్తమా! మేలుకో, ఏ చింతన ద్వారా అయితే తన పర బేధ భావన ఉండదో ఆ చింతన చెయ్యాలి. ఆచరించకుండా చెప్పేవారు పతితులు అవుతారు. మనం ఆచరించి ఇతరులు అడిగితే బోధించాలి. సాధకుడు తత్వం గురించి అడుగుతాడు. అతని సంశయం అతనికి శూలంగా గుచ్చుకొంటుంది. జీవితం యొక్క మూల తత్వం గురించి ఏమిటని బోధకుడు ప్రశ్నిస్తే గురువు చెప్పే విషయాన్ని సవివరంగా చెప్పగలగాలి. అది మనలోని పవిత్రత స్థాయినిబట్టి ఉంటుంది. ఆ బోధ వినటం వల్ల మనస్సు అనే వాయిద్యం మోగదు. చంచలతత్వం సమాప్తమైపోతుంది. తృష్ణారూప పాత్ర ముక్కలై పోయింది. మమతా గర్వం కాలిపోయింది. కామరూపమనే వస్త్రం ఇప్పడు రంగులు పోయి పాతబడి చిరిగి పోయింది. కర్మలన్నీ కాలిపోయాయి. ఇంద్రియాలు శాంతించాయి గురు నామంతో కర్మ మసి అంతా పోయి శుభ్రపడింది. గురుకృప కారణంగా పరతత్వం యొక్క సాక్షాత్కారాన్ని పొందాను అంటాడు కృతార్థుడైన సాధకుడు. ఏవిధంగానైతే నువ్వుల్లో నూనె ఉంటుందో అలాగే చెకుముకి రాళ్ళలో అగ్ని ఉంటుందో అలాగే ప్రభువు మనలోనే ఉన్నాడు మేల్కొని చూడు అంటారు గురువులు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966